నేటి నిజం

తెలుగు దినపత్రిక

website:www.netinijam.com

E-mail : netinijam93@gmail.com



హైదరాబాద్ శనివారం 20-2-2021 RNI No.52865/93·Postal No\.H/SD/258/2018-2020 ఎడిటర్: బైస దేవదాస్: సెల్:9000065433 సంపుటి :27 సంచిక: 172 పేజీలు: 4 వెల: రూ.1/-

తెలంగాణ అర్చకసంఘం అధ్యక్షుడు మృతి

గుజరాత్ ప్రమాదంలో గాయపడి చికిత్స పొందుతూ తుదిశ్వాస
సంతాపం ప్రకటించిన మంత్రి ఇంద్రకరణ్ రెడ్డి

హైదరాబాద్,ఫిబ్రవరి19(ఆర్ఎన్ఎ): గుజరాత్ రాష్ట్రంలో ఇటీవల జరిగిన రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన తెలంగాణ అర్చక సంఘం అధ్యక్షుడు వెంకటేశ్వర శర్మ శుక్రవారం తుదిశ్వాస విడిచారు. ఉత్తరాది నదీ జలాల కోసం దేవాదాయ శాఖ ఉద్యోగులు గత నెలలో గుజరాత్ వెళ్లారు. ఈ క్రమంలో జనవరి 24న సోమనాథ ఆలయానికి వెళ్తుండగా ద్వారక్ వద్ద ఎదురుగా వస్తున్న వాటర్ ట్యాంకర్‌ను వారు ప్రయాణిస్తున్న కారు ఢీకొట్టింది. ఈ ఘటనలో అడిక్‌మెట్ ఆంజనేయ స్వామి ఆలయ ఈవో శ్రీనివాస్, పాన్‌బజార్ వేణుగోపాలస్వామి దేవస్థానంలో జూనియర్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్న రమణ అక్కడికక్కడే మరణించారు. వెంకటేశ్వర శర్మ, ఈవో సత్యనారాయణ, క్లర్క్ కేశవరెడ్డి తీవ్రంగా గాయపడ్డారు. వారి పరిస్థితి విషమంగా ఉండటంతో అహ్మదాబాద్‌లోని హోప్ దవాఖానకు తరలించారు. కాగా, పరిస్థితి విషమించడంతో వెంకటేశ్వర శర్మ శుక్రవారం కన్నుమూశారు. తెలంగాణ అర్చక సంఘం అధ్యక్షుడు వెంకటేశ్వర శర్మ మృతి పట్ల దేవాదాయ శాఖ మంత్రి అల్లోల ఇంద్రకరణ్ రెడ్డి సంతాపం తెలిపారు. ఆయన కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతిని ప్రకటించారు. ఆయన ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థించారు. వెంకటేశ్వర శర్మ కుటుంబానికి అన్ని విధాల అండగా ఉంటామని భరోసానిచ్చారు. వెంకటేశ్వర శర్మ పద్మారావు నగర్ పోల్ బాల్ హనుమాన్ దేవాలయంలో అర్చకులుగా విధులు నిర్వహిస్తున్నారు. జనవరి 24న గుజరాత్ రాష్ట్రంలోని సోమనాథ ఆలయానికి వెళుండగా దోల్కా జిల్లా మోతి బోర్ వద్ద ఎదురుగా వస్తున్న వాటర్ ట్యాంకర్‌ను వారు ప్రయాణిస్తున్న కారు ఢీకొట్టింది. ఈ ఘటనలో అడిక్‌మెట్ ఆంజనేయ స్వామి ఆలయ ఈవో శ్రీనివాస్, పాన్‌బజార్ వేణుగోపాలస్వామి దేవస్థానంలో జూనియర్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్న రమణ అక్కడికక్కడే మరణించారు. ఈవో సత్యనారాయణ ఇటీవలే మృతి చెందగా.. అహ్మదాబాద్‌లోని హోప్ హాస్పిటల్‌లో చికిత్స పొందుతున్న వెంకటేశ్వర శర్మ కూడా తుదిశ్వాస విడిచారు.

కీసర బ్రహ్మోత్సవాలకు ఏర్పాట్లు

హైదరాబా,ఫిబ్రవరి19(ఆర్ఎన్ఎ): శివరాత్రిని పురస్కరించుకుని నగర శివార్లలోని కీసరగుట్ట జాతర బ్రహ్మోత్సవాల్లో భాగంగా భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా జిల్లా యంత్రాంగం ఆధ్వర్యంలో తగిన ఏర్పాట్లు చేస్తున్నట్లు జిల్లా కలెక్టర్ శ్వేతా మహంతి తెలిపారు. మార్చి 9వ తేదీ నుంచి 14వ తేదీ వరకు జరిగే బ్రహ్మోత్సవాల ఏర్పాట్లలో భాగంగా కలెక్టర్,అదనపు కలెక్టర్లు విద్యాసాగర్, జాన్ శ్యాంసన్‌లతో పాటు జిల్లాకు చెందిన పలు శాఖల అధికారులతో కలిసి జాతర ఏర్పాట్లను స్వయంగా పరిశీలించారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ కొవిడ్ నిబంధనలు పాటిస్తూ భక్తుల కోసం వసతులు కల్పించాలని అధికారులకు సూచించారు. ప్రస్తుతం ఉన్న సీసీ కెమెరాలకు తోడు మరిన్ని ఏర్పాటు చేయాలని డీసీసీ రక్షితమూర్తిని ఆదేశించారు.

వైజ్ఞానిక ప్రదర్శనకు పేర్లు నమోదు చేసుకోవాలి

హైదరాబాద్,ఫిబ్రవరి19(ఆర్ఎన్ఎ): జవహర్‌లాల్ నెహ్రూ వైజ్ఞానిక, గణిత, పర్యావరణ జిల్లా స్థాయి ప్రదర్శన (2020-21)లో పాల్గొనేందుకు అన్ని ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల విద్యార్థులు ఈ నెల 26వ తేదీలోగా పేర్లు నమోదు చేసుకోవాలని హైదరాబాద్ డీఈవో రోహిణి తెలిపారు. ఆరు నుంచి 10వ తరగతి విద్యార్థులు పాల్గొనేలా ప్రధానోపాధ్యాయులు చర్యలు తీసుకోవాలని సూచించారు. ఈ ప్రదర్శనలో మొదటి బహుమతి పొందిన విద్యార్థులు రాష్ట్రస్థాయి వైజ్ఞానిక ప్రదర్శనలో పాల్గొంటారని వివరించారు. వివరాలకు జిల్లా సైన్స్ అధికారి ధర్మేందర్‌రావును 7799171277, 8309468801 సంప్రదించాలన్నారు.

గల్వాన్ ఘటనపై నోరువిప్పిన చైనా

తమ దేశానికి చెందిన ఐదుగురు అధికారులు మృతి
సెంట్రల్ మిలిటరీ కమిషన్ ఆఫ్ చైనా వెల్లడి

బీజింగ్,ఫిబ్రవరి19(ఆర్ఎన్ఎ): గల్వాన్ ఘటనపై ఇంతకాలం దాస్తూ వచ్చిన నిజాలను ఎట్టకేలకు చైనా ఒప్పుకుంది. తమ సైనికులను కోల్పోయిన విషయంపై నోరు విప్పింది.గత ఏడాది లడాఖ్‌లోని గాల్వాన్ లోయలో జరిగిన ఘర్షణలో అయిదుగురు ఆఫీసర్లతో పాటు సైనికులు కూడా మృతిచెందినట్లు చైనా అంగీకరించింది. భారత సైనికులతో పాటు చైనాకు చెందిన పీపుల్స్ లిబరేషన్ ఆర్మీ మధ్య ఆ రోజున హింసాత్మక ఘర్షణ చోటుచేసుకున్నది. కరకోరమ్ పర్వతశ్రేణుల్లో విధులు నిర్వర్తిస్తున్న అయిదురు సైనిక బలగాలకు చెందిన వారు మృతిచెందినట్లు సెంట్రల్ మిలిటరీ కమిషన్ ఆఫ్ చైనా వెల్లడించింది. భారత్‌తో జరిగిన సరిహద్దు ఘర్షణలో ఆ అయిదుగురు ప్రాణత్యాగం చేసినట్లు చైనా పేర్కొన్నది. గాల్వన్ దాడిలో భారత్‌కు చెందిన 20 మంది సైనికులు మృతిచెందిన విషయం తెలిసిందే. తెలంగాణకు చెందిన కల్నల్ సంతోష్‌బాబు కూడా ఆ ఘర్షణలో వీరమరణం పొందారు. అయితే గాల్వాన్ దాడిలో తమ దళాలకు చెందిన అయిదుగురు సభ్యులు మృతిచెంది నట్లు చైనా తొలిసారి అంగీకరిస్తూ ప్రకటన చేసింది. పీఎల్ఏకు చెందిన పత్రిక తన కథనంలో ఈ విషయాన్ని వెల్లడించింది. గాల్వాన్ ఘర్షణలో ప్రాణాలు కోల్పోయిన సైనికుల్లో పీఎల్ఏ జింగ్‌జాంగ్ మిలిటరీ కమాండ్‌కు చెందిన కమాండర్ క్యూ ఫాబావో ఉన్నట్లు గ్లోబల్ టైమ్స్ పేర్కొన్నది. రెజిమెంటల్ కమాండర్ క్యూ ఫాబావోకు హీరో రెజిమెంటల్ కమాండర్ టైటిల్‌ను బహూకరించారు. పీఎల్ఏ దళాధినేత, దేశాధ్యక్షుడు జీ జిన్‌పింగ్ ఆ అవార్డును ప్రకటి ంచారు. సరిహద్దుల్ని రక్షించి సైనికులు ఈ అవార్డును ఇస్తారు. బోర్డర్‌ను డిఫెండ్ చేసిన మరో సైనికాధికారి చెన్ హోన్గ్జున్‌కు కూడా హీరో టైటిల్‌ను ఇచ్చారు. ఫస్ట్ క్లాస్ మెరిట్ అవార్డు అందుకున్నవారిలో చెన్ జియాంగ్‌రాంగ్, జియావో సియువాన్, వాంగ్ జువారన్‌లు ఉన్నారు. అయితే గాల్వాన్ ఘర్షణలో ఈ అయిదుగురు ఆఫీసర్లు ప్రాణాలు కోల్పోయినట్లు పీఎల్ఏ తొలిసారి అంగీకరించింది. గాల్వన్ లోయ ఘర్షణలో వీరమరణం పొందిన సైనికుల వివరాలను భారత్ వెంటనే ప్రకటించినా.. చైనా మాత్రం ఆ ఘర్షణలో ప్రాణాలు కోల్పోయిన పీఎల్ఏ సైనికులు వివరాలను మాత్రం గోప్యంగా ఉంచింది. ఆ దాడిలో సుమారు 45 మంది చైనా సైనికులు మృతిచెందినట్లు ఫిబ్రవరి పదో తేదీన రష్యా న్యూస్ ఏజెన్సీ టాస్ పేర్కొన్నది. గాల్వాన్ ఘర్షణ తర్వాత రెండు దేశాల సరిహద్దు వద్ద తీవ్ర ఉద్రిక్తత నెలకొన్న విషయం తెలిసిందే. పలుమార్లు సైనిక, దౌత్య చర్చలు జరిగాయి. అయితే రెండు రోజుల నుంచి పాన్‌గాంగ్ సరస్సు వద్ద ఉన్న ప్రాంతం నుంచి చైనా తమ దళాలను ఉపసంహరించింది. ఈ నేపథ్యంలో భారత్ కూడా తమ దళాలను వెనక్కి రప్పిస్తున్నది.

హైదరాబాద్‌లో ఆకస్మిక వర్షం

చల్లబడ్డ వాతావరణం

హైదరాబాద్,ఫిబ్రవరి19(ఆర్ఎన్ఎ): ఉపరితల ద్రోణి ప్రభావంతో హైదరాబాద్‌లో పలు చోట్ల వర్షం కురిసింది. సోమాజీగూడ, పంజాగుట్ట, అమీర్‌పేట్, సనత్ నగర్, బేగంపేట, జూబ్లీహిల్స్ ,బంజారా హిల్స్, ఫిలింనగర్, హైటెక్ సిటీ, మాదాపూర్, కొంపల్లి, చింతల్, బోయిన్‌పల్లి, జీడిమెట్ల, సూరారంలో ప్రాంతాల్లో వర్షం కురిసింది. దీంతో ట్రాఫిక్‌కు అంతరాయం కలగింది. వెంటనే అప్రమత్తమయిన జీహెచ్ఎంసీ అధికారులు పరిస్థితిని సమీక్షిస్తున్నారు. గత అర్ధరాత్రి కూడా నగరంలో వర్షం కురవడంతో పలు ప్రాంతాల్లో విద్యుత్‌కు అంతరాయం ఏర్పడిన సంగతి తెలిసిందే. కాగా రాష్ట్ర వ్యాప్తంగా మరో రెండు రోజుల పాటు మోస్తారు వర్షం కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ వెల్లడించింది. ఉత్తర కర్ణాటక నుంచి దక్షిణ మధ్య మహారాష్ట్ర వరకు ఏర్పడిన ఉపరితల ద్రోణి ప్రభావంతో పలు చోట్ల వర్షాలు కురిసే అవకాశం ఉందని తెలిపింది. ఉత్తర కోస్తా ఆంధ్రప్రదేశ్ తీరం మరియు దాని పరిసర ప్రాంతాలలో ఉన్న ఉపరితల ఆవర్తనం 1.5 కిమీ నుండి 3.1 కిమీ ఎత్తు వరకు విస్తరించి ఉంది. దక్షిణ మధ్య మహారాష్ట్రదాని పరిసర ప్రాంతాలలో 0.9 కి. మీ. ఎత్తు వరకు విస్తరించి ఉన్న ఉపరితల ఆవర్తనం బలహీన పడింది. రాష్ట్రంలో ఒకటి రెండు చోట్ల తేలికపాటి వర్షాలు కురిసే అవకాశం ఉంది. నేడు,రేపు పొడి వాతావరణం ఏర్పడే అవకాశం ఉంది.

కరోనా నివారణకు పతంజలి మందు

-వెల్లడించిన రాందేవ్ బాబా

న్యూఢిల్లీ,ఫిబ్రవరి19(ఆర్ఎన్ఎ): కరోనాకు తొలి సాక్ష్యాధారిత మందును తీసుకొచ్చినట్లు పతంజలి సంస్థ వెల్లడించింది. ఈ మేరకు శుక్రవారం దీనికి సంబంధించిన శాస్త్రీయ పరిశోధన పత్రాన్ని యోగా గురు రాందేవ్ బాబా విడుదల చేశారు. ఈ కార్యక్రమంలో కేంద్ర ఆరోగ్యశాఖ మంత్రి హర్షవర్ధన్, రోడ్డు రవాణా, హైవేల శాఖ మంత్రి నితిన్ గడ్కరీ కూడా పాల్గొన్నారు. గతేడాది జూన్‌లోనే పతంజలి.. కరోనిల్, శ్వాసరి పేరుతో కరోనాకు మందును తీసుకొచ్చిన విషయం తెలిసిందే. ఈ ఆయుర్వేద మందు కొవిడ్‌పై వంద శాతం ప్రభావవంతంగా పని చేసినట్లు క్లినికల్ ట్రయల్స్‌లో రుజువైందని పతంజలి సంస్థ చైర్‌పర్సన్ ఆచార్య బాలకృష్ణ వెల్లడించారు. గిలోయ్, తులసి, అశ్వగంధ వంటి ఆయుర్వేద మూలికల నుంచి ఈ మందులు తయారు చేశారని, కరోనా పేషెంట్లపై ఇది సమర్థవంతంగా పని చేసినట్లు బాబా రాందేవ్ కూడా చెప్పారు.

గురుదేవ్ రవీంద్రనాథ్ ఠాగూర్ ముందుచూపు

సమున్నత లక్ష్యంతో విశ్వభారతి అభివృద్ధి
కొత్త విద్యావిధానం ప్రతిభను ప్రదర్శించగలిగే స్వేచ్ఛ
శాంతినికేతన్ స్నాతకోత్సవంలో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా మోడీ ప్రసంగం

న్యూఢిల్లీ,ఫిబ్రవరి19(ఆర్ఎన్ఎ): విశ్వభారతి విశ్వవిద్యాలయంలో విద్యా వ్యవస్థను గురుదేవ్ రవీంద్రనాథ్ ఠాగూర్ సమున్నత లక్ష్యంతో అభివృద్ధి చేశారని ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ చెప్పారు. లోబడి ఉండాలనే సంకెళ్ళ నుంచి భారతదేశ విద్యా వ్యవస్థకు విముక్తి కల్పించడం, ఆధునికీకరించడం లక్ష్యంగా విద్యా వ్యవస్థను తీర్చిదిద్దారన్నారు. ఈ విశ్వవిద్యాలయం కాన్వొకేషన్ సందర్భంగా శుక్రవారం ఆయన వీడియో కాన్ఫరెన్సింగ్ ద్వారా మాట్లాడారు. నూతన జాతీయ విద్యా విధానం (ఎన్ఈపీ) లక్ష్యం కూడా పాత సంకెళ్ల నుంచి భారత దేశ విద్యా వ్యవస్థకు విముక్తి కల్పించడమేనని మోదీ చెప్పారు.

విద్యార్థులు తమ ప్రతిభను ప్రదర్శించగలిగే స్వేచ్ఛను నూతన విద్యా విధానం ఇస్తుందని తెలిపారు. స్వయం సమృద్ధ భారత దేశం వైపు వేసిన గొప్ప ముందడుగు నూతన జాతీయ విద్యా విధానమని పేర్కొన్నారు. పరిశోధన, నవకల్పనలకు ఈ విధానం శక్తినిస్తుందన్నారు. 2021 కేంద్ర బడ్జెట్‌లో జాతీయ పరిశోధన ఫౌండేషన్ ద్వారా రూ.50 వేల కోట్లు ఖర్చు చేయాలని ప్రతిపాదించినట్లు తెలిపారు. పరిశోధన ఆధారిత అధ్యయనం కోసం రానున్న ఐదేళ్ళలో ఈ సొమ్మును ఖర్చు చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు పేర్కొన్నారు. బాలికలు, మహిళలు సాధికారులు కాకపోతే మన దేశం స్వయం సమృద్ధి సాధించడం సాధ్యం కాదన్నారు. నూతన జాతీయ విద్యా విధానంలో జెండర్ ఇంక్లూజన్ నిధిని ఏర్పాటు చేశామని, దీనిని బాలికలను సాధికారులను చేయడానికి వినియోగిస్తామని చెప్పారు. స్నాతకోత్సవ కార్యక్రమంలో పాల్గొనడం ప్రేరణాత్మకంగా, సంతోషంగా ఉందన్నారు. నేరుగా ఆ కార్యక్రమంలో పాల్గొనుంటే బాగుండేదని, కానీ కోవిడ్ వల్ల అక్కడికి రాలేకపోయినట్లు ఆయన తెలిపారు. ప్రపంచవ్యాప్తంగా ఉగ్రవాదం, హింసను వ్యాప్తి చేస్తున్నవారిలో అత్యధికంగా ఉన్నత చదువులు చదువుకున్నవారు, నైపుణ్యం కలిగి ఉన్నవారే ఉన్నారన్నారు. మరోవైపు హాస్పిటళ్లు, ల్యాబ్‌ల్లో ఉన్న అనేక మంది మహమ్మారి నుంచి ప్రజలను కాపాడేందుకు తమ ప్రాణాలను రిస్క్‌లోకి నెట్టేస్తున్నారన్నారు. ఇది ఐడియాలజీకి సంబంధించిన అంశం కాదు అని, ఇది మైండ్‌సెట్‌కు సంబంధించిన అంశమని ప్రధాని తెలిపారు. మీరు ఏది చేసినా.. అది మీ మైండ్‌సెట్ పాజిటివ్‌గా ఉందా లేక నెగటివ్‌గా ఉందా అన్న అంశంపై ఆధారపడుతుందన్నారు. అయితే ప్రతి ఒక్కరికీ ఆ రెండు అంశాలు ఎదురవుతుంటాయని, కానీ సమస్యలు సృష్టించాలా లేక పరిష్కరించాలా అన్న అంశాన్ని ఎన్నుకునేది మన చేతుల్లో ఉంటుందని ప్రధాని తెలిపారు. కొత్తగా ప్రవేశపెట్టిన జాతీయ విద్యా విధానం.. ఆత్మనిర్భర్ భారత్‌కు కీలకమైన అడుగు అన్నారు. ఆ విద్యావిధానం ద్వారా పరిశోధన, ఆవిష్కరణలు పెరుగుతాయని అన్నారు. కొత్త విద్యావిధానంతో మన దేశం విశ్వగురువుగా మారుతుందని బెంగాల్ గవర్నర్ జగదీప్ ధంకర్ తెలిపారు. విద్యా సంస్కరణల్లో ఈ స్కీమ్ గేమ్‌చేంజర్‌గా పనిచేస్తుందని ఆయన అన్నారు.

బోరబండలో టెన్షన్ టెన్షన్

శివాజీ విగ్రహ ప్రతిష్టాపనకు పోలీసుల నో

హైదరాబాద్,ఫిబ్రవరి19(ఆర్ఎన్ఎ): బోరబండలో క్షణం క్షణం టెన్షన్ వాతావరణం నెలకొంది. బోరబండ చౌరస్తాలో ఛత్రపతి శివాజీ విగ్రహాన్ని ఏర్పాటు చేసేందుకు ఆర్ఎస్ఎస్, భగజరంగ్‌దళ్, బీజేపీ నేతలు ప్రయత్నాలు చేస్తున్నారు. అయితే విగ్రహ ఏర్పాటుకు అనుమతిలేదని పోలీసులు చెబుతున్నారు. ఏది ఏమైనా విగ్రహాన్ని ప్రతిష్టించి తీరుతామని సంఘ్ నేతలు చెప్పిన నేపథ్యంలోనే బోరబండలో భారీగా పోలీసు బలగాలు మోహరించారు. పోలీసులు, ఆర్ఎస్ఎస్ కార్యకర్తలు భారీగా చేరుకోవడంతో అక్కడ ఉద్రిక్త పరిస్థితులు ఏర్పడ్డాయి. ఏం జరుగుతోందోనని బోర బండలో వాసులు ఆందోళన చెందుతున్నారు. ఇటీవల బోరబండలో శివాజీ విగ్రహాన్ని పోలీసులు తొలగించారు. బోరబండ చౌరస్తా ప్రాంతంలో ఉన్న బాబా మందిర ప్రహరీ పక్కన బీజేపీ బోరబండ నాయకులు సుమారు 3 అడుగుల దిమ్మెకట్టి విగ్రహాన్ని అర్ధరాత్రి ఏర్పాటు చేశారు. విషయం తెలియడంతో విగ్రహాన్ని తొలగించేందుకు జీహెచ్ఎంసీ అధికారులు, పోలీసులు అక్కడికి చేరుకున్నారు. విగ్రహాన్ని తొలగించేందుకు క్రేన్ సహాయంతో అధికారులు ప్రయత్నిం చగా.. బీజేపీ నాయకులు, కార్యకర్తలు పెద్దఎత్తున అక్కడికి చేరుకొని అడ్డుకునే ప్రయత్నం చేశారు. విగ్రహాన్ని ఆలయ స్థలంలో ఏర్పాటు చేస్తున్నందున అనుమతి అవసరం లేదన్నారు. విగ్రహాన్ని తరలించే వాహనాన్ని బీజేపీ నాయకులు, కార్యకర్తలు చుట్టుముట్టారు. దీంతో పోలీసులు బీజేపీ కార్యకర్తల మధ్య వాగ్వాదం జరిగింది. మహిళలు వాహనం ముందు బైఠాయిం చారు. పోలీసులు నిరసన తెలుపుతున్న వారిని అరెస్టు చేసి విగ్రహాన్ని తరలించారు.

పార్లమెంట్, రాష్ట్రపతి భవన్ డిజైన్లను పరిశీలించిన మంత్రి ప్రశాంత్ రెడ్డి

హైదరాబాద్, ఫిబ్రవరి 19: తెలంగాణ ప్రభుత్వం నూతనంగా నిర్మిస్తున్న అసెంబ్లీ భవనానికి నగిషీలు దిద్దేందుకు ముఖ్యమంత్రి ఆదేశాలకు మేరకు పార్లమెంట్, రాష్ట్రపతి భవన్‌కు వినియోగించిన రాళ్లను, నిర్మాణ డిజైన్లను పరిశీలించేందుకు శాసనసభ వ్యవహారాలు, రోడ్లు-భవనాలశాఖ మంత్రి మంత్రి వేముల ప్రశాంత్ రెడ్డి అధికారులతో కలిసి ఢిల్లీకి వెళ్లారు. శుక్రవారం హస్తినా పర్యటనలో మంత్రి బిజీబిజీగా గడిపారు. ఉదయం అధికారులతో ఆయన పార్లమెంట్, రాష్ట్రపతి భవన్‌లో సౌత్, నార్త్ బ్లాక్‌లో నిర్మాణాలను వీక్షించారు.పార్లమెంట్ భవనం నిర్మాణంలో వినియోగించిన రెడ్‌స్టోన్ (ఎర్రరాతి) ని పరిశీలించారు. పార్లమెంట్ ఎదుట ఫౌంటెయిన్‌లను, రాష్ట్రపతి భవన్‌లో ఉన్న వివిధ రకాల రాతి నిర్మాణాలు, ఉపయోగించిన రాతి రకాలు, ఫౌంటెయిన్‌లు, అశోక హాల్‌ను తిలకించారు. మంత్రి వెంట ఆర్అండ్‌బీ ఈఎన్‌సీ గణపతి రెడ్డి, ఈఈ శశిధర్, ఆర్కిటెక్ట్ ఆస్కార్, షాపూర్ జీ సంస్థ ప్రతినిధి లక్ష్మణ్ పలువురు అధికారులు ఉన్నారు.

తిరుమలలో ఘనంగా రథసప్తమి వేడుకలు

స్వామి వారికి పలు వాహనసేవలతో పూజలు

తిరుమల,ఫిబ్రవరి19(ఆర్ఎన్ఎ): భగవాన్ సూర్య జయంతి సందర్భంగా కలియుగ ప్రత్యక్ష దైవం తిరుమల వేంకటేశ్వరస్వామి సన్నిధిలో రథసప్తమి వేడుకలు వైభవంగా ప్రారంభమయ్యాయి. ఆలయంలో తెల్లవారు జామున కైంకర్యాలు పూర్తయిన తర్వాత 5.30 గంటలకు సూర్యప్రభ వాహనంపై మలయప్పస్వామి తిరుమాడ వీధుల్లో విహరిస్తూ భక్తులను అనుగ్రహించారు. పెద్ద సంఖ్యలో భక్తులు గ్యాలరీల్లో బారులు తీరి, స్వామివారిని దర్శించుకున్నారు. శ్రీవారి ఆలయాన్ని పుష్పాలతో తీర్చిదిద్దారు. రథసప్తమి సందర్భంగా స్వామి వారికి జరిగే ఆర్జిత సేవలైన కల్యాణోత్సం, ఆర్జిత బ్రహ్మోత్సవం, ఊంజల్‌సేవ, సహస్రదీపాలంకార సేవలను రద్దు చేశారు. సుప్రభాతం, తోమాల, అర్చనలను, అభిషేక సేవలను ఏకాంతంగా నిర్వహించారు. మాడ వీధుల్లో భక్తులకు తాగునీరు, మజ్జిగ, అన్నప్రసాదం, అత్యవసర వైద్యసేవలు అందుబాటులో ఉండేలా టీటీడీ ఏర్పాట్లు చేసింది. కరోనాతా ఇంతకాలం దూరంగా ఉన్న భక్తులు భారీగా తరలి వచ్చారు. మాడవీధుల్లోమళ్లీ భక్తకళ కనిపించింది. భక్తుల కోలాటాలు జోరుగా సాగాయి. స్వామిని దర్శించుకుని హారతి తీసుకునేందుకు భక్తులు పోటీ పడ్డారు.

పుదుచ్చేరిలోనే తమిళిసై మకాం

తెలంగాణపై రాజ్‌భవన్ అధికారులతో వీడియో కాన్ఫరెన్స

హైదరాబాద్,ఫిబ్రవరి19(ఆర్ఎన్ఎ): పుదుచ్చేరి లెఫ్టినెంట్ గవర్నర్‌గా అదనపు బాధ్యతలు స్వీకరించిన రాష్ట్ర గవర్నర్ డా. తమిళిసై సౌందరరాజన్ శుక్రవారం పుదుచ్చేరి నుండి తెలంగాణ రాష్ట్ర అంశాలపై సమీక్ష నిర్వహించారు. పుదుచ్చేరి రాజ్ నివాస్ నుండి గవర్నర్ వీడియో కాన్ఫరెన్స్ ద్వారా హైదరాబాద్ రాజ్ భవన్ అధికారులతో తెలంగాణ రాష్ట్ర అంశాలకు సంబంధించిన వివిధ విషయాలపై సమగ్రంగా సమీక్ష చేశారు.

ఈ సందర్భంగా ఆమె మాటాడుతూ తాను పుదుచ్చేరి లెఫ్టినెంట్ గవర్నర్ గా అదనపు బాధ్యతలు స్వీకరించి నప్పటికీ, తెలంగాణకు సంబంధిం చిన విషయాలపై, ఇతర డెవలప్ మెంట్స్‌పై తెలుసుకుంటూనే ఉన్నానని తెలిపారు.

అలా గే తెలంగాణ ప్రజల సంక్షేమం, బాగోగులు నాకు అత్యంత ప్రాధాన్యత. నేను పుదుచ్చే రిలో ఉన్నప్పటికీ తెలంగాణ రాష్ట్ర అభివృద్ధి, ప్రజల సంక్షేమం పట్ల అణుక్షణం నా తపన అలానే ఉందని పేర్కొన్నారు. రాజ్ భవన్, హైదరాబాద్ అధికారులకు ఎల్లప్పుడూ అందుబాటులోనే ఉంటాను. అవసరమైన విషయాలు నా దృష్టికి తీసుకురండని సూచిం చారు. తెలంగాణ రాష్ట్రం, ప్రజలకు సంబం ధించిన విషయాలు నాకు అత్యంత ప్రాధా న్యం అని డా. తమిళిసై సౌందర రాజన్ వివరించారు. గవర్నర్ కార్యదర్శి కె. సురేంద్ర మోహన్ పుదుచ్చేరి నుండి గవర్నర్‌తో వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్నారు. హైదరాబాద్ రాజ్ భవన్ నుండి గవర్నర్ సలహాదారులు, జాయింట్ సెక్రటరీలు, ఇతర అధికారులు ఈ వీడియో కాన్ఫరెన్స్ లో పాల్గొన్నారు.

చరిత్రలో నేటినిజం



నేటినిజం
శనివారం 20-2-2021

ఆందోళన కలిగిస్తున్న రోడ్డు ప్రమాదాలు

రోడ్డు ప్రమాదాలు ఇటీవల మళ్లీ పెరిగాయి. ఎక్కడ చూసినా రోజూ ఎక్కడో ఓ చోట ప్రమాదం జరిగిన ఘటనలు కుటుంబాలను కలవరపెడుతున్నాయి. దేశం మొత్తం ఇటీవలి కాలంలో వరుస ప్రమాదాలు మరింత ఆందోళన కలిగిస్తున్నాయి. స్వీయ తప్పిదాలకు తోడు, రోడ్డు మార్గాలు సరిగా లేకపోవడం కూడా ప్రమాదాలుజరిగిన తీరును గమనిస్తే తెలుస్తుంది. పొగమంచు లాంటి కారణంగా రోడ్డు కనిపించకుండా వాహనాలు ప్రమాదం బారిన పడిన సంఘటను కూడా ఉన్నాయి. ప్రధానంగా మానవ తప్పిదాల కారణంగా అనేక చోట్ల ప్రమాదాలు జరుగుతున్నాయి. అనేకులు మృత్యువాత పడుతున్నారు. ప్రమాదాలకు ఫలానా కారణం అన్నది లేకుండా పోయింది. తాగి డ్రైవింగ్చేయడం, ఓవర స్పీడ్‌తో పోవడం కూడా ప్రమాదాలకు కారణం అవుతున్నాయి. తాజాగా రోడ్డుభద్రతా వారోత్సవాల్లో నటుడు జూనియర్ ఎన్టీఆర్ చేసిన హెచ్చరిక అందరికీ కనువిప్పు కావాలి. రోడ్డు ప్రమాదంలో తన తండ్రిని, అన్నను కోల్పోయిన ఘటనలను ఆయన ప ప్రస్తావించారు. చాలా సందర్భాల్లో అతివేగంతో పాటు, మద్యం సేవించడం,ర్యాష్ డ్రైవింగ్ వంటివి కూడా కారణంగా పోలీసులు చెబుతున్నారు. రోడ్లు సరిగా లేకపోవడం, విస్తరణ చేపట్టకపోవడం కూడా కారణంగా చెప్పవచ్చు. కరీంనగర్-హైదరాబాద్ మధ్యను ఉన్న రాజీవ్ రహదారినే తీసుకుంటే.. ఇక్కడ నిత్యం ప్రమాదాలుజరుగుతూనే ఉన్నాయి. ఈ రోడ్డు ప్రమాదాలకు నిలయంగా మారింది. రోడ్డు మార్గంలో నిత్యం ప్రమాదాలు సర్వసాధారణంగా మారాయి. ఈ రహదారిని సక్రమంగా మార్చాలని తెలంగాణ ఉద్యమ సమయంలో సిఎం కెసిఆర్, హరీష్ రావులు డిమాండ్ చేయడమే గాకుండా ఆందోళనలు కూడా చేపట్టారు. రోడ్డుపై వంటావార్పూ చేశారు. తెలంగాణ సాకారం అయ్యాక రోడ్డుకు ఉన్న ములపులను సరిచేస్తామని అన్నా...అయినా అది సాకారం కాలేదు. రాజీవ్ రహదారిపై 24 గంటలపాటు వాహనాల రద్దీ ఉంటుంది. ప్రమాదకరంగా ఉన్న ప్రాంతంలో రాజీవ్ రహదారిని సరిచేసి, రక్షణ చర్యలు పటిష్టంగా ఏర్పాటు చేయాల్సి ఉండగా అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు. దీంతో ప్రమాదాలు జరిగినప్పుడు వాహనదారుల ప్రాణాలు గాలిలో కలిసి పోతున్నాయి. ప్రమాద సంఘటన జరిగిన సమయాల్లో అధికారులు హడావుడి చేసి నియంత్రణ చర్యలు చేపడతామని చెప్పడం మినహా శాశ్వతంగా ఎలాంటి రక్షణ చర్యలు తీసుకోకుండా నిర్లక్ష్యం వ్యవహరిస్తుండడంతో ప్రమాదాలు పునరావృత మవుతున్నాయని ప్రజలు వాపోతున్నారు. రహదారిపై సాగునీటి కాలువల వద్ద సరైన రక్షణ చర్యలు చేపట్టకపోవడంతో వరుసగా ప్రమాదాలు జరుగుతున్నాయి. రాజీవ్‌రహదారిపై అల్లుగూర్ వద్ద కాకతీ య కెనాల్ డేంజర్‌స్పాట్‌గా మారింది. వరుసగా ప్రమాదాలు జరిగి వాహనదారులు ప్రాణాలు గాలిలో కలుస్తున్నా రాజీవ్‌రహదారి నిర్వహణ సంస్థకాని, ఆర్‌అండ్‌బీ అధికారులు, పోలీసులు, ఇతర ఉన్నతాధికారులు ప్రమాదాల నివారణకు చర్యలు తీసుకోక పోవడం ఆందోళనను కలిగిస్తున్నది. రక్షణ చర్యలు చేపట్టకుండా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తూ ఇంకెందరి ప్రాణాలు బలితీసుకుంటారని ప్రజలు, వాహనదారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఉమ్మడి జిల్లాలోని రాజీవ్‌రహదారి, ఇతర ప్రధాన రహదారులు, రోడ్లతోపాటు గ్రామీణ ప్రాం తాల రోడ్లను ఆనుకుని ఉన్న వ్యవసాయ బావులు, ఎస్సారెస్పీ కాలువలు ఎలాంటి రక్షణ లేకుండా ప్రమాదకరంగా ఉన్నాయి. సాగునీటి కాలువల వద్ద రక్షణ గోడలు, ఫెన్సింగ్‌లు ఏర్పాటు చేయాల్సిన అవసరాన్ని గుర్తించడం లేదు. ఇకపోతే చెన్నైని కలుపుతూ సాగే నెల్లూరు జిల్లాలోని రహదారులు ప్రమాద కేంద్రాలుగా మారడంతో రోజుకు రెండు నుంచి మూడుకుపైగానే ప్రమాదాలు జరుగుతున్నాయి. జాతీయ రహదారిపై నిబంధనలు పాటించే వాహనదారులు కనిపించడం లేదు. నిబంధనల అమలులో వాహనదారులు, అధికారులు నిర్లక్ష్యం వహిస్తున్నారు. ఎంతో మంది క్షతగాత్రులు అవుతుండగా సగటున రోజుకి ఒకరైనా ప్రాణాలు విడుస్తున్నారు. అతివేగం, నిద్రమత్తు, మద్యం సేవించి వాహనాలు నడపడం, నిర్లక్ష్యంతోనే ప్రమాదాలు అధికంగా జరుగు తున్నాయి. మరోవైపు రోడ్ల పక్కన విచ్చలవిడిగా వాహనాలు ఆపుతుండటం వల్ల కూడా ప్రమాదాలు జరుగుతున్నాయి. వీటి నివారణకు పోలీసు శాఖ, రవాణా శాఖలతోపాటు మరి కొన్ని శాఖలు చర్యలు చేపట్టాల్సి ఉన్నా ఎవరికి వారుగా మిన్నకుండిపోతున్నారు. రోడ్డు పక్కనే వాహనాలు నిలుపుదలను అరికట్టడంలో అధికారులు నిత్యం విఫలమవుతూనే ఉన్నారు. దూర ప్రాంతాలకు రాకపోకలు సాగించే లారీలు, వాహనాల నిలుపుదల కోసం జిల్లాలో ఐదు ప్రాంతాలను రాష్ట్ర ప్రభుత్వం గుర్తించింది. ఇక్కడ వాహనాలు ఆపడం, డ్రైవర్లు స్నానం చేసేందుకు, వంటలు వండుకునేందుకు అన్ని ఏర్పాట్లు చేసింది. కావలి నుంచి తడ వరకు ఈ ప్రాంతాలు ఉన్నా ఇక్కడ నిలిపే వారి సంఖ్య అతి తక్కువగానే ఉంటోంది. మద్యం దుకాణాలు, దాబా హోటళ్ల వద్ద గంటల తరబడి వాహనాలు ఆపుతున్నారు. దీంతో ఈ వాహనాల ద్వారానే ప్రమాదాల సంఖ్య అధికంగా ఉంటుంది. రోడ్డు ప్రమాదాలను నివారిందుకు కలిసి పని చేయాల్సిన పలు శాఖల మధ్య సమన్వయ లోపం కొట్టొచ్చినట్టు కనిపిస్తోంది. జాతీయ రహదారులపై క్రాస్ పాయింట్లను ఆర్టీవో, పోలీసు, విద్యార్థులు సంయుక్తంగా సర్వే చేసి గుర్తించారు. 3వేలకుపైగానే క్రాస్ రోడ్లు ఉన్నట్టు ప్రభుత్వానికి నివేదిక ఇచ్చారు. వీటితోపాటు 29 డేంజర్ స్పాట్లను గుర్తించినా వాటిలో పూర్తి స్థాయిలో ప్రమాదాలను నివారించడంలో ఆర్టీవో అధికారులు సైతం నిర్లక్ష్య ధోరణిలో వ్యవహరిస్తున్నారన్న ఆరోపణలు ఉన్నాయి. రోడ్డు ప్రమాదాలపై ప్రజలకు నిరంతరం అవగాహన కల్పిస్తూనే ఉన్నామని పోలీసులు అంటున్నారు. అతివేగం ప్రమాదాలకు కారణమని పదే పదే తెలుపుతున్నా ప్రజలు ఏమాత్రం పట్టించుకోవడం లేదన్నారు. తరచూ అతివేగంతో వాహనాలు నడుపుతూ ప్రాణాలు కోల్పోతున్నారు. రోడ్డు భద్రతా వారోత్సవాలు నిర్వహిస్తున్న వేళ తరచూ జరుగుతున్న ప్రమాదాల స్పాట్‌లను గుర్తించి వాటిని సరిచేసేందుకు చర్యలు తీసుకుంటే తప్ప పరిస్థితి బాగుపడదు.

వ్యవసాయంలో సేంద్రియ బాట పట్టండి

-రైతులకు శాస్త్రవేత్తల సూచన

నిజామాబాద్,ఫిబ్రవరి19(ఆర్ఎన్ఎ): రైతులు అప్పుల నుంచి బయటపడేందుకు లాభసాటి, నాణ్యమైన పంటలు పండించాలని వ్యవసాయవేత్తలు సూచించారు. డిమాండ్ ఉన్న పంటలను కేవలం సేంద్రియ పద్ధతుల్లో పండించడం అలవాటు చేసుకోవాలని అన్నారు. దుకాణాదారుల మోసపూరిత మాటలు నమ్మకూడదని, సారవంతమైన భూములను కాపాడుకోవాలని సూచించారు. వ్యవసాయ శాస్త్రవేత్తలు, అధికారుల సలహాలు పాటించి మంచి దిగుబడులు సాధించాలని రైతులకు సూచించారు.అప్పుడు అంతర్‌ఆజతీయంగా కూడా డిమాండ్ ఉంటుందన్నారు. మార్కెట్‌లో డిమాండ్, అవసరాలకు అనుగుణంగా పంటలు సాగు చేయాలని చెప్పారు. రసాయన ఎరువులు వాడడంతో రైతులు అనారోగ్యం బారిన పడుతున్నారని తెలిపారు. రైతులు ఒకే సమయంలో ఒకే రకమైన పంటలు పండించడంతో నష్టపోతున్నారని అన్నారు. జొన్న, మొక్కజొన్న వంటి సంప్రదాయ పంటలను పండించాలని సూచించారు. రైతులు పత్తిని సీసీఐ వారికి అమ్మకుండా ప్రైవేట్ వ్యాపారులకు తక్కువ ధరకు అమ్మడంతో నష్టపోతున్నారని తెలిపారు.జీవ వైవిధ్యాన్ని పెంపొందించాలని, అంతరిస్తున్న అటవీ సంపదను కాపాడుకోవాలని అన్నారు. 267 రకాల పురుగులు పంటలను నాశనం చేస్తున్నాయని, జిల్లాలో వంద ఏండ్లకు పైగా పత్తి పంట సాగు చేస్తున్నారని, నిపుణులు, అనుభవజ్ఞులు, శాస్త్రవేత్తల సలహాలు, సూచనల ప్రకారం వ్యవసాయం చేయాలని సూచించారు. దిగుబడి పెరుగుతున్న కొద్దీ ధరలు కూడా పెరుగుతున్నాయని, వ్యవసాయరంగంలో పురాతన పద్ధతులను పరిశీలించాల్సిన అవసరం ఉందని అభిప్రాయం వ్యక్తం చేశారు. వివిధ శాఖల అధికారులు, శాస్త్రవేత్తలు వారి అనుభవాలను, సూచనలను అందించారు. పంట కాపాడుకొనే సమయంలో ఫెన్సింగ్‌కు విద్యుత్ అమర్చడంతో రైతులు మరణించడం, ఆ రైతు కుటుంబాలు అనాథలు అవుతున్నారని తెలిపారు. పంట చుట్టూ బయో ఫెన్సింగ్ ఏర్పాటు చేసుకోవాలని సూచించారు.

తాగునీటి సమస్యలపై దృష్టి

ఆదిలాబాద్,ఫిబ్రవరి19(ఆర్ఎన్ఎ): ప్రజలకు తాగునీటి సమస్యలు తలెత్తకుండా వేసవి లోగా మిషన్ భగీరథ పైప్‌లైన్ పనులు పూర్తిచేసి ఇంటింటికీ నల్లా నీరు అందించాలని ఆదిలాబాద్ మున్సిపల్ చైర్‌పర్సన్ జోగు ప్రేమేందర్ సూచించారు. వేసవి కాలాన్ని దృష్టిలో ఉంచుకొని తాగునీటి సరఫరాకు చర్యలు తీసుకోవాలన్నారు. పట్టణంలో ఇంటింటికీ నల్లా బిగింపు పనులను వేగవంతం చేయాలన్నారు. పైప్‌లైన్ కోసం తవ్విన గుంతలను పనులు పూర్తి కాగానే పూడ్చివేయాలన్నారు. కాలనీవాసులు, మహిళలతో మాట్లాడి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. కాలనీలో సీసీ రోడ్లు, మురికి కాల్వలు నిర్మించాలని పలువురు విజ్ఞప్తి చేశారు. వీధి దీపాలు ఏర్పాటు చేయాలని, అర్హులైన పేదలకు ఇండ్ల పట్టాలు ఇప్పించాలని కోరారు. టీఆర్ఎస్ ప్రభుత్వం కాలనీలో అభివృద్ధి పనులు చేస్తున్నదని అన్నారు.

శివరాత్రి ఉత్సవాలకు ఏర్పాట్లు

జనగామ,ఫిబ్రవరి19(ఆర్ఎన్ఎ): బచ్చన్నపేట,మండలంలోని ప్రముఖ శైవక్షేత్రమైన కొడవటూరు సిద్ధులగుట్టలో మహాశివరాత్రి సందర్భంగా నిర్వహించే శివకల్యాణం, బ్రహ్మోత్సవాలను ఘనంగా నిర్వహించాలని జనగామ ఎమ్మెల్యే ముత్తిరెడ్డి యాదగిరిరెడ్డి సూచించారు. వచ్చే నెలలో నాలుగు రోజులపాటు జరిగే ఉత్సవాల్లో వేలాదిగా భక్తులు పాల్గొంటారు. ఈ మేరకు అధికారులు పక్కాగా చర్యలు తీసుకోవాలన్నారు. ఏటా శివకల్యాణం అంగరంగ వైభవంగా జరిపిస్తున్నారని అభినందించారు. రెట్టింపు ఉత్సాహంతో ఈసారి వైభవంగా జరిపించాలన్నారు. ప్రభుత్వం, దేవాదయ శాఖ తరఫున సహాయ సహకారాలు ఉంటాయన్నారు. సిద్ధేశ్వరుడి ఆశీర్వాదాలను భక్తులు ఏటా పొందుతున్నట్లు చెప్పారు. ఆలయ అభివృద్ధికి దేవాదాయ శాఖ తరఫున నిధులు మంజూరయ్యాయని ముత్తిరెడ్డి అన్నారు. అవసరమైతే మరిన్ని నిధులు మంజూరు చేసి జిల్లాలోనే సిద్ధులగుట్టను మినీ యదాద్రిగా తీర్చిదిద్దేందుకు కృషి చేస్తానన్నారు.

ఇద్దరు వ్యక్తుల మృతదేహాలు లభ్యం

హైదరాబాద్,ఫిబ్రవరి19(ఆర్ఎన్ఎ): నగరంలోని యాకత్‌పుర రైల్వేస్టేషన్ శుక్రవారం వద్ద రెండు మృతదేహాలు కలకలం సృష్టించాయి. అనుమానాస్పద స్థితిలో ఇద్దరి వ్యక్తుల మృతదేహాలు కనిపించాయి.

సమాచారం అందుకున్న పోలీసులు వెంటనే సంఘటనా స్థలాన్ని పరిశీలించారు. మృతి చెందిన ఇద్దరిని తండ్రి కొడుకులుగా భావిస్తున్నారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు. మృతదేహాలను ఉస్మానియా హాస్పిటల్‌కు తరలించారు. ఇద్దరు ఆత్మహత్య చేసుకున్నారా? లేదంటే ఎవరైనా హత్య చేసి ఉంటారా? అనే కోణం పోలీసులు విచారణ జరుపుతున్నారు. అయితే మృతులకు సంబంధించి వివరాలు తెలియరాలేదు.

చత్రపతి శివాజీ జయంతి సందర్భంగా విగ్రహావిష్కరణ

రాజన్న సిరిసిల్ల, ఫిబ్రవరి 19 : (నేటినిజం ప్రతినిధి):చత్రపతి శివాజీ జయంతి సందర్భంగా వేములవాడ మండలం జయ్యారం గ్రామంలో ఛత్రపతి శివాజీ విగ్రహం విస్తరణ జరిగింది పలువురు ప్రజాప్రతినిధులు పాల్గొని ఛత్రపతి శివాజీ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ గడ్డం హన్మాండ్లు, టీఆర్ఎస్ సీనియర్ నాయకుడు ఏనుగు మనోహర్ రెడ్డి, బిజెపి జిల్లా అధ్యక్షుడు ప్రతాప రామకృష్ణ ,బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు ఎర్రం మహేశ్ , ప్రధాన కార్యదర్శి మల్లిఖార్జున్, ఆర్య క్షత్రియ నాయకులు తదితరులు పాల్గొన్నారు

సంస్కృతి, సంప్రదాయాలను భావితరాలకు అందించాలి : ఎమ్మెల్సీ కవిత

హైదరాబాద్,ఫిబ్రవరి19(ఆర్ఎన్ఎ): సంస్కృతి, సంప్రదాయాలను భవిష్యత్ తరాలకు అందించాలని ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత పిలుపునిచ్చారు. శుక్రవారం జూబ్లీహిల్స్ పెద్దమ్మగుడి వద్ద ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం గ్రామోదయ ఛాంబర్ ఆఫ్ కామర్స్ అండ్ టెక్నాలజీ నిర్వహిస్తున్న కుంభ్ సందేశ్ రథయాత్రను ప్రారంభించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ దేశ సంస్కృతి, సంప్రదాయాలు ప్రపంచానికే మార్గదర్శకంగా నిలుస్తున్నాయన్నారు. కరోనా మహమ్మారి వంటి క్లిష్టమైన సమయంలోనూ ప్రపంచ మంతా, భారత సంప్రదాయాలు పాటించిందని గుర్తు చేశారు. సంస్కృతిని కొత్త తరానికి చేరవేయడంతో పాటు, ప్రపంచవ్యాప్తం చేసేందుకు కుంభ్ సందేశ్ యాత్రను చేపట్టిన వసంత్‌ను ఎమ్మెల్సీ కవిత అభినందించారు. కార్యక్రమంలో రాష్ట్ర ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడు బోయినపల్లి వినోద్‌కుమార్, ఆధ్యాత్మికవేత్త సత్యవతి తదితరులు పాల్గొన్నారు. కాగా, రథయాత్ర కుంభమేళా విశిష్టతను తెలియజేస్తూ కన్యాకుమారి నుంచి హరిద్వార్ వరకు

సాగనుంది. ఇదిలావుంటే మరాఠా యోధుడు ఛత్రపతి శివాజీ జయంతి సందర్భంగా ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత నివాళులర్పించారు. 'యోధుడు, నిరుపమాన నాయకుడైన ఛత్రపతి శివాజీ మహారాజ్ జయంతి సందర్భంగా ఆయనకు నివాళులు అర్పిస్తున్నాను. పోరాట యోధునికి శిరస్సు వంచి నమస్కరిస్తున్నాను' అని కవిత ట్వీట్ చేశారు. మాజీ మంత్రులు లక్ష్మారెడ్డి, జోగు రామన్న ఛత్రపతి శివాజీకి పుష్పాంజలి ఘటించారు. శివాజీ జయంతి సందర్భంగా మహబూబ్‌నగర్లోని రాజాపూర్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో జడ్చర్ల ఎమ్మెల్యే, మాజీ మంత్రి లక్ష్మారెడ్డి పాల్గొన్నారు. శివాజీ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. ప్రతి యువకుడు శివాజీ జీవితాన్ని ఆదర్శంగా తీసుకుని దేశభక్తిని పెంపొందించుకోవాలని, ఆయన అడుగు జాడల్లో నడవాలని సూచించారు. అనంతరం టీఆర్ఎస్ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని ప్రారంభించారు.

దారికి వస్తున్న కాశ్మీర్ పరిస్థితులు

గతాన్ని మరచి విమర్శలు చేస్తున్న వారు ఆలోచించాలి

న్యూఢిల్లీ,ఫిబ్రవరి19(ఆర్ఎన్ఎ): కశ్మీర్‌లో 370 ఆర్టికల్ రద్దు తరవాత పరిణామాలు దారికొస్తున్న వేళ.. విపక్షాలు ఇంకా అనేకానేక విమర్శలతో ప్రభుత్వాన్ని తిట్టిపోసే పనిలో పడ్డారు. నేరుగా 370 రద్దుపై వాదించకుండా అక్కడ ఆంక్షలపై మండిపడుతున్నారు. నిజానికి ఏడు దశాబ్దాలుగా భారత్‌లో అంతర్భాగంగా లేని ఓ ప్రాంతాన్ని దాఇకి తెచ్చుకునే క్రమంలో కేంద్రం సాహసోపేత నిర్ణయం తీసుకున్న తీరు అభినందనీయం. అందులో భాగంగా అక్కడి నేతలను గృహనిర్బంధంలో పెట్టక తప్పలేదు. ఈ చర్యలు ప్రజాభద్రతకు అవసరమని చెప్పనక్కరలేదు. ఒమర్ అబ్దుల్లా కశ్మీర్ ప్రజలను భారత్‌కు వ్యతిరేకంగా ప్రజలను రెచ్చగొట్టగలరని అభియోగ పత్రంలో పోలీసులు ఆరోపించారు. కశ్మీర్‌లో ఉగ్రవాదం పతాకస్థాయిలో ఉన్నకాలంలో ఎన్నికలు బహిష్కరించాలంటూ ఉగ్రవాద సంస్థలు, వేర్పాటువాదులు పిలుపునిస్తూ వచ్చారు. వారికి అక్కడి పార్టీలు వత్తాసు పలుకుతూ వచ్చాయి. 2008లో ఎన్నికల బహిష్కరణకు వేర్పాటువాదులు పిలుపుని చ్చారు. ప్రతి ఎన్నికప్పుడు, పోలింగ్ పెరిగినప్పుడు కశ్మీర్ భారత్ అంతర్భాగంగా కొనసాగాలని ప్రయత్నాలు సాగాయి. కశ్మీర్‌ను భారత్ అన్యాయంగా ఆక్రమించు కుందన్నారనీ, నిషేధిత జమాతే ఇస్లామియా కు అనుకూలంగా మహబూబా ముఫ్తీ మాట్లాడారు. అలాగే తమ జోలికి వస్తే ఖబర్దార్ అని పలుమార్లు కేంద్రాన్ని హెచ్చరించారు. 370 రద్దుకు వ్యతిరేకంగా మాట్లాడం కూడా నేరమే. తండ్రి ముఫ్తీ మహ్మద్ సయీద్ అడుగుజాడల్లో నడిచి బీజేపీతో మైత్రిని కొనసాగించడంతో జమ్మూకశ్మీర్‌లో కమలం కాలూనేందుకు మరింత వీలు కలిగింది. అనంతరం ఆమె పార్టీతో వ్యూహాత్మకంగా తెగదెంపులు చేసుకొని ఆ రాష్ట్రాన్ని రెండు ముక్కలు చేయడానికీ అవకాశం దక్కింది. ఇంతకాలం కశ్మీర్‌ను గుప్పిట్లో పెట్టుకున్న అబ్దుల్లాలు, ముఫ్తీల కారణంగా అక్కడ సామాన్యులకు బతకడం భారమైంది. ఉగ్రవాదులకు స్వరగధామం అయ్యింది. పాక్ ప్రేరేపిత ఉగ్రవాద మూకలు, వేర్పాటువాదులు ఆ రాష్ట్రాన్ని కల్లోలకాసారంగా మార్చేసిన తరుణంలో కూడా లోపాయకారి సహకారం అక్కడి పాలకుల నుంచి అందిందనడంలో సందేహం లేదు. కశ్మీరీలంతా ఢిల్లీమీద ఆగ్రహంతో రోడ్లమీదకు వచ్చినప్పుడల్లా వారిపక్షాన వాదిస్తున్నట్లు కనిపిస్తూనే వేర్పాటువాదుల బలం చేకూరేలాల చేశారు. వారు తమ రాజకీయ ప్రయోజనాలకోసమే ఇదంతా చేసారనడంలో సందేహం లేదు. భారత రాజ్యాంగాన్నీ, ప్రజాస్వామ్యాన్నీ నమ్మి ఏనాడూ గట్టిగా పోరాడలేదు. కేంద్రప్రభుత్వం తీసుకుంటున్న చర్యలతో కశ్మీర్‌ను మరింత స్వేచ్ఛగా భారత్‌లో ఉండేలా చేస్తున్న తీరు ఇలాంటి వారికి నచ్చకపోవచ్చు. అందుకే లెఫ్ట్ సహా అనేక పార్టీలు అక్కడ ఇనేతల నిర్బంధాన్ని మాత్రమే ఎత్తి చూపుతున్నారు.

పట్టభద్ర ఎన్నికల్లో పల్లా ప్రచారం

-సూర్యాపేటలో గ్రాడ్యుయేట్లను కలిసి వినతి

సూర్యాపేట,బ్రవరి19(ఆర్ఎన్ఎ): ఎమ్మెల్సీ ఎన్నికల నేపథ్యంలో నల్లగొండ, ఖమ్మం, వరంగల్ నియోజకవర్గ టీఆర్ఎస్ అభ్యర్థి పల్లా రాజేశ్వర్ రెడ్డి ముమ్మరంగా ప్రచారం చేస్తున్నారు. ఇందులో భాగంగా మంత్రి జగదీశ్‌రెడ్డితో కలిసి శుక్రవారం ఉదయం సూర్యాపేట పట్టణంలోని ఎస్వీ కాలేజీ, మినీ ట్యాంక్‌బండ్ వద్ద మార్నింగ్ వాకర్స్ కలిశారు. మొదటి ప్రాధాన్యతా ఓటు వేసి గెలిపించాలని కోరారు.

గడిచిన ఆరేండ్లలో గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీగా పల్లా విశేష సేవలు అందించారని చెప్పారు. రైతు సమన్వయ సమితి అధ్యక్షుడిగా ఆయన చేసిన సేవలు ఎనలేనివన్నారు.

శాసన మండలి సభ్యునిగా నిత్యం ప్రజల్లో ఉంటారని, అన్ని వర్గాల ప్రజా సమస్యలను శాసనమండలిలో ప్రస్తావిస్తూ వాటిని ప్రభుత్వం, ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లి పరిష్కారం లభించేలా చేశారన్నారు. మరోసారి అవకాశం ఇస్తే మీ ప్రతినిధిగా మిగిలిన సమస్యల

పరిష్కారించే బాధ్యత రాజేశ్వర్ రెడ్డి తీసుకుంటారని హామీ ఇచ్చారు. మొదటి ప్రాధాన్యం ఓటు పల్లా రాజేశ్వర్‌రెడ్డికి వేయాలని విజ్ఞప్తి చేశారు. పట్టభద్రుల సమస్యలను పరిష్కరించే గొంతుగా పనిచేస్తానని, మరోసారి దీవించి మండలికి పంపించాలని పల్లా రాజేశ్వర్ రెడ్డి కోరారు. పట్టభద్రుల నుంచి అపూర్వమైన స్పందన వస్తున్నదని చెప్పారు. తెలంగాణ ప్రభుత్వం ఐటీ, ఫార్మా, నిర్మాణ, తయారీ రంగంలో కొత్తగా 14,800 కంపెనీలను ఆకర్షించగలిగిందని, దీనిద్వారా 16 లక్షల 50 వేల మందికి ఉద్యోగాలు లభించాయని తెలిపారు. దేశంలో 5.5 శాతం నిరుద్యోగ రేటు ఉంటే, రాష్ట్రంలో మాత్రం 4.5 శాతం మాత్రమే ఉందన్నారు. దేశంలో ఎక్కడా లేనివిధంగా లక్షా 31 వేల ఉద్యోగాలు భర్తీ చేశామని వెల్లడించారు. మొదటి ప్రాధాన్యత ఓటు వేసి ఆశీర్వదించాని, సేవ చేసి రుణం తీర్చుకుంటానని చెప్పారు.

లాయర్ జంట హత్య కేసులో బిట్టు శ్రీను అరెస్ట్

పుట్ట మధు మేనల్లుడు బిట్టు శ్రీనుగా గుర్తింపు
హత్యకు సంబంధించి దర్యాప్తు ముమ్మరం

పెద్దపల్లి,ఫిబ్రవరి19(ఆర్ఎన్ఎ): న్యాయవాద జంట గట్టు వామన్‌రావు-పీవీ నాగమణి హత్య కేసులో బిట్టు శ్రీనును పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. రహస్య ప్రదేశంలో అతడిని విచారిస్తున్నారు. ఇక ఈ కేసులో ఇప్పటికే కుంట శ్రీనివాస్‌ను(ఏ1), చిరంజీవిని (ఏ2), అక్కపాక కుమార్(ఏ3)ను పోలీసులు అరెస్టు చేసిన విషయం తెలిసిందే. ఈ క్రమంలో బిట్టు శ్రీను కూడా పట్టుబడటంతో నలుగురు నిందితులను కోర్టులో ప్రవేశపెట్టనున్నారు. కాగా బిట్టు శ్రీను పెద్దపల్లి జిల్లా పరిషత్ ఛైర్మన్, మాజీ ఎమ్మెల్యే పుట్టా మధు మేన ల్లుడు. వామనరావు దంపతుల హత్యలో భాగంగా రిజిస్ట్రేషన్ కాని బ్రీజా కారును, కొబ్బరికాయలు కోసే కత్తులను బిట్టు శ్రీను ప్రధాన నిందితుడు కుంట శ్రీనివాస్‌కు సమకూర్చాడు. ఈ క్రమంలో శ్రీను కారు డ్రైవర్ చిరంజీవితో కలిసి శ్రీనివాస్ నడిరోడ్డు పైనే అడ్వకేట్ జంటపై హత్యాకాండకు తెగబడ్డాడు. ఇక సొంత గ్రామం గుంజపడుగులో మృతులతో నిందితులకు నెలకొన్న గొడవలే ఈ ఘటనకు కారణమని పోలీసులు వెల్లడించారు. కుంట శ్రీనివాస్ ఇంటి నిర్మాణాన్ని వామన్‌రావు అడ్డుకోవడం, అదే విధంగా ఊరిలో నిర్మిస్తున్న దేవాలయం పనులకు అభ్యంతరం తెలపడం, రామాలయ కమిటీ వివాదాల కారణంగా హత్యలు జరిగినట్లు ప్రాథమిక విచారణలో తేలినట్లు తెలిపారు.

జల సంరక్షణ చర్యలు చేపట్టాలి

నీటిని పొదుపుగా వాడుకుంటేనే మేలు

ఆదిలాబాద్,ఫిబ్రవరి19(ఆర్ఎన్ఎ): జలమే జీవనం అని, జలం లేనిదే జీవనం లేదని గుర్తించాలని మాజీమంత్రి, ఎమ్మెల్యే జోగు రామన్న అన్నారు. జలశక్తి అభియాన్ లక్ష్యాన్ని గ్రామస్థాయి నుంచి అవగాహన కల్పించాలనే ఉద్దేశంతో గ్రామం, మండల, జిల్లా కమిటీల ద్వారా రైతులు, ప్రజల్లో అవగాహన కల్పించడంతో పాటు పర్యవేక్షించనున్నట్లు తెలిపారు. గతంలో బావులు, కాల్వల నీటి ద్వారా వ్యవసాయం చేసే వారని సాంకేతికత పెరగడం వల్ల రానురాను బోరుబావులు ఎక్కువవడంతో భూగర్భ జలాలు అడుగంటా యన్నారు. ఈ కార్యక్రమ ఆవశ్యకతను వివరిస్తూ ప్రతీ ఇంటికి ఇంకుడుగుంత, చెక్‌డ్యాం, ఫాంపాండ్స్ నిర్మించుకునేలా ప్రోత్సహించాలన్నారు. ప్రభుత్వం నుంచి నియమించిన వ్యవసాయ అధికారుల సూచనలు, సలహాలు పాటించి తక్కువ నీటితో దిగుబడి సాధించాలని రైతులకు సూచించారు. హరితహారంలో భాగంగా కోట్లాది మొక్కలు నాటడం వల్ల భవిష్యత్‌లో ఇది ఎంతో ప్రయోజనం కల్పిస్తుందని అన్నారు. జల సంరక్షణ, పొదుపుగా వినియోగించడంపై జిల్లా యంత్రాంగం సమష్టిగా పని చేస్తోందన్నారు. ఇదిలావుంటే గ్రామీణ ప్రాంతాల్లో క్షేత్రస్థాయి నుంచి ప్రతీ వ్యక్తిలో చైతన్యం పెరగాలని పిలుపునిచ్చారు. జిల్లాలో నీటి ఎద్దడి గల గ్రామాన్ని నీటి మిగులు గ్రామంగా మార్చడం జలశక్తి అభియాన్ లక్ష్యం అన్నారు. పలు గ్రామాల్లో భూగర్భ జలాల శాతం ప్రమాదకర పరిస్థితికి చేరుకోవడాన్ని గుర్తించి రెండున్నర నెలల పాటు నీటి సంరక్షణ చర్యలు చేపట్టామన్నారు. జిల్లాలో వాటర్‌షెడ్‌లు, ఇంకుడుగుంతలు, ఫాంపాండ్స్ ఏర్పాటు చేసినట్లు తెలిపారు. భవిష్యత్‌లో మన సంపాదన మొత్తం నీరు కొనుగోలుకు ఖర్చయ్యి, ఆర్థిక సమస్య ఏర్పడనుందన్నారు. సంప్రదాయ నీటి వనరులను సద్వినియోగం చేసుకుని బోర్లు, బావుల్లో జలాల నిల్వలను పునరుద్ధరించు కోవాలన్నారు. మహిళలు నీటి సంరక్షణతో పాటు పొదుపుగా వాడుకోవాలని సూచించారు.

రుణమాఫీ హామీని మరచిన టిఆర్ఎస్

పంట రుణాలు తీసుకున్న రైతులకు నోటీసులు దారుణం: విజయశాంతి

హైదరాబాద్,ఫిబ్రవరి19(ఆర్ఎన్ఎ): అధికారంలోకి వస్తే లక్ష రూపాయల వరకు రుణమాఫీ చేస్తామని టీఆరెస్ గత అసెంబ్లీ ఎన్నికలప్పుడు హామీ ఇచ్చిందని, ఆ హామీ నీటి మీద రాతలా మారిందని బీజేపీ సీనియర్ నేత విజయశాంతి మండిపడ్డారు. ఎన్నికల హామీ అమలు కాలేదు సరికదా... పంటలసాగు కోసం రైతులు తీసుకున్న రుణాల్ని ఐదు రోజుల్లో రెన్యువల్ చేయకుంటే చట్టపరమైన చర్యలు తప్పవంటూ కోర్టులు రైతులకు నోటీసులు జారీ చేస్తున్నాయని మండిపడ్డారు. ఇది చాలక బ్యాంకులో క్రాప్ లోన్ ఉందంటూ పించన్లు, రైతు బంధు కూడా ఆపుతున్నారని ఆమె ఆరోపించారు. కొంతమంది రైతుల ఖాతాల నుంచి వడ్డు అమ్ముకున్న డబ్బుల్ని కూడా ఇవ్వకుండా, లోన్ కింద జమ చేసుకున్నారని పేర్క

మతమార్పిడులు..ఆలయాలపై దాడులు

ప్రజల దృష్టి మళ్లించేందుకే విశాఖ స్టీల్‌ప్లాంట్ అంశం
సంచలన వ్యాఖ్యలు చేసిన ఎపి బిజెపి నేతలు

గుంటూరు,ఫిబ్రవరి19(ఆర్ఎన్ఎ): మతమార్పుదులు..ఆలయాలపై దాడుల నుంచి ప్రజల దృష్టి మళ్లించేందుకే విశాఖ స్టీల్‌ప్లాంట్ అంశం తెరపైకి వచ్చిందని ఎపి బిజెపి నేతలు సంచలన వ్యాఖ్యలు చేసారు. ఈ విషయంలో అధికార వైకాపా, టిడిపి కుమ్మక్కయ్యాయని అన్నారు. దేశ భక్తి, రాముని ఆలోచన బీజేపీ సిద్ధాంతాలని బీజేపీ రాష్ట్ర అధ్యక్షులు సోమువీర్రాజు అన్నారు. శుక్రవారం పలువురు ముస్లిం నాయకులు బీజేపీలో చేరారు. ఈ సందర్భంగా సోమువీర్రాజు మాట్లాడుతూ దేశంలో ఉన్నవారంతా వందేమాతరం పాడాల్సిందే అని అన్నారు. అబ్దుల్ కలాంని రాష్ట్రపతి చేసింది బీజేపీనే అని చెప్పుకొచ్చారు. మైనార్టీల అభివృద్ధి బీజేపీతోనే సాధ్యమని స్పష్టం చేశారు. ఏపీలో జరుగుతున్న ప్రతి అభివృద్ధి కేంద్రం చేస్తున్నదే అని సోమువీర్రాజు తెలిపారు. విశాఖ స్టీల్ ప్లాంట్ అంశంపై ఏపీ బీజేపీ చీఫ్ సోము వీర్రాజు ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. ఆలయాలపై దాడుల విషయంలో వైసీపీ, టీడీపీ కుమ్మక్కు అయ్యాయని సోమువీర్రాజు తెలిపారు. ప్రభుత్వం టీడీపీతో చేతులు కలిపి బీజేపీని ఏకాకిని చేసిందని సంచలన వ్యాఖ్యలు చేశారు. ఆలయాలపై దాడుల అంశం నుంచి దృష్టి మరల్చేందుకే.. విశాఖ స్టీల్ ప్లాంట్ అంశాన్ని టీడీపీ, వైసీపీ తెరపైకి తెచ్చాయని ఆరోపణలు చేశారు స్టీల్ ప్లాంట్ ఉద్యమాన్ని రెచ్చగొట్టే ప్రయత్నం జరుగుతోందన్నారు. స్టీల్ ప్లాంట్‌పై కేంద్ర మంత్రి ఒక్క ప్రకటన చేయలేదని.. ఒక్క నోటిఫికేషన్ కూడా ఇవ్వలేదు, మరి ఉద్యమం ఎందుకు ? అని సోమువీర్రాజు ప్రశ్నించారు. ఆలయాలపై దాడుల వ్యవహారాన్ని కేంద్రం దృష్టికి తీసుకెళ్లామని ఆయన తెలిపారు. ఇదిలావుంటే బీజేపీని ఇరుకున పెట్టే కుట్ర జరుగుతోందని ఎంపీ జీవీఎల్ వ్యాఖ్యానించారు. ప్రజల దృష్టి మరల్చేందుకే ఉక్కు ఫ్యాక్టరీ అంశం తెచ్చారన్నారు. పాస్టర్లు వందల కోట్లు తెచ్చి మతమార్పిడులు చేస్తున్నారని ఆరోపించారు. విశాఖ స్టీల్ ప్లాంట్ పేరుతో తమపై నిందలు వేస్తారా అని మండిపడ్డారు. మంత్రులు, ఎమ్మెల్యేలు రాజ్యాంగ ఉల్లంఘనకు పాల్పడ్డారన్నారు. కేంద్రం నిర్ణయం తీసుకోనప్పుడు ఆందోళనలు సరికాదని ఎంపీ జీవీఎల్ తెలిపారు.

విశాఖ స్టీల్ ప్లాంట్‌ను దిగమింగే ప్రయత్నం : పట్టాభి

అమరావతి,ఫిబ్రవరి19(ఆర్ఎన్ఎ): వైసీపీ ప్రభుత్వం విశాఖ స్టీల్ ప్లాంట్‌ను దిగమింగే ప్రయత్నం చేస్తోందని టీడీపీ నేత పట్టాభిరామ్ తీవ్రస్థాయిలో విమర్శించారు. శుక్రవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ దాదాపు రూ. 2లక్షల కోట్ల విలువైన భూముల్ని కబ్జా చేయడం కోసం కుట్ర చేస్తోందన్నారు. ఉక్కు కర్మాగారం పరిరక్షణకు సంబంధించిన ఉద్యమంలో పాల్గొనడానికి అర్హత లేని వైసీపీ నాయకుల్ని... మరీ ముఖ్యంగా విజయసాయి రెడ్డి లాంటి పందికొక్కుల్ని ప్రజలు తరమికొట్టాలని పిలుపు ఇచ్చారు. పరిరక్షణ ఉద్యమం వేదికలపైనుంచి వైసీపీ నాయకులను తరిమికొట్టాలన్నారు. సీఎం జగన్ ఆడుతున్న డ్రామను రాష్ట్ర ప్రజలు అర్థం చేసుకుని గట్టిగా నిలదీయాలని పట్టాభి సూచించారు.

అమరావతిలో ఎస్సీ వర్గీయులపై వైసీపీ నేతల దాడి

రాళ్ల దాడి చేయడం జగన్ రెడ్డి ఫ్యాక్షన్ పాలనకు నిదర్శనం
మండిపడ్డ టిడిపి అధినేత చంద్రబాబు నాయుడు

అమరావతి,ఫిబ్రవరి19(ఆర్ఎన్ఎ): అమరావతిలో ఎస్సీ వర్గీయులపై వైసీపీ నేతల దాడిని టీడీపీ అధినేత చంద్రబాబు నాయుడు తీవ్రంగా ఖండించారు. పంచాయతీ ఎన్నికల్లో పోటీ చేస్తే చంపేస్తామంటూ రాజధాని పరిధిలోని ఎస్సీలపై వైసీపీ కార్యకర్తలు రాళ్ల దాడి చేయడం జగన్ రెడ్డి ఫ్యాక్షన్ పాలనకు నిదర్శన అని వ్యాఖ్యానించారు. ప్రజాస్వామ్యంలో ఎవరికైనా స్వేచ్ఛగా పోటీచేసే హక్కు ఉందనే విషయాన్ని జగన్ రెడ్డి, వైసీపీ నేతలు గుర్తించాలని అన్నారు. పెద్దకూరపాడు నియోజకవర్గంలోని లింగాపురం గ్రామ పంచాయతీ ఎన్నికలకు నామినేషన్ వేశారనే కోపంతో దాడి అత్యంత హేయమని మండిపడ్డారు. దళితులు రాజకీయాల్లోకి రాకూడదా.? అని...పంచాయతీ ఎన్నికల్లో పోటీ చేయకూడదా.? అని బాబు ప్రశ్నించారు. వైసీపీ నేతల దాడి ప్రజాస్వామ్యానికి మాయని మచ్చ అని దుయ్యబట్టారు. ఎన్నికలు స్వేచ్ఛాయుత వాతావరణంలో నిర్వహించలేని పరిస్థితులు నెలకొన్నప్పటికీ.. ప్రజామద్దతు ఉందని చెప్పుకోవడం సిగ్గుచేటన్నారు.వైసీపీ గూండాలను గ్రామాల మీదకు వదిలి బడుగు బలహీన వర్గాల ప్రజలపై దాడులకు పాల్పడుతారా.? అని నిలదీశారు. ఇళ్లకు వెళ్లి బెదిరించడమే కాకుండా మహిళల పట్ల అసభ్యంగా ప్రవర్తించడం అత్యంత హేయమని తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. కులం పేరుతో దూషించి, రాళ్లతో దాడి చేసిన వైసీపీ నేతలపై ఫిర్యాదు చేసినా పోలీసులు కేసు నమోదు చేయకపోవడం పోలీసు వ్యవస్థను ఎంతగా నీరుగారుస్తున్నారో అర్థమవుతోందన్నారు. ఫిర్యాదు చేసి నిందితులను అరెస్టు చేయాలని అర్ధరాత్రి నుంచి స్టేషన్ బయటే పడిగాపులు కాస్తున్నా... పోలీసులు పట్టించుకోకపోవడం పోలీసు వ్యవస్థ పనితీరుకు నిదర్శనమని వ్యాఖ్యానించారు. ఇప్పటికైనా పోలీసులు దాడికి పాల్పడిన వైసీపీ నేతలపై కేసు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. ప్రశాంత వాతావరణంలో ఎన్నికలు జరిగేలా చర్యలు తీసుకోవాలని చంద్రబాబు నాయుడు కోరారు

నేటి నుండి కరీంనగర్ కమిషనరేట్ పోలీసుల స్పోర్ట్స్ అండ్ గేమ్స్ మీట్ ప్రారంభం

కరీంనగర్, ఫిబ్రవరి 19: (నేటినిజం ప్రతినిధి):ఈనెల 20న నేటినుండి(శనివారం) 23వరకు మూడురోజుల పాటు నిర్వహించతలపెట్టిన కరీంనగర్ కమిషనరేట్ పోలీసులు స్పోర్ట్స్ అండ్ గేమ్స్‌మీట్ ప్రారంభంకానున్నది. జిల్లాల పునర్జిభజన తర్వాత పోలీస్ కమిషనరేట్ ఏర్పాటు అనంతరం నిర్వహిస్తున్న తొలి స్పోర్ట్స్ అండ్ మీట్ అన్నివిభాగాల్లోనూ విజయవంతం చేయడం కోసం పోలీస్‌శాఖ అట్టాహాసంగా ఏర్పాట్లు చేసింది.

పోలీస్‌శాఖలోని అన్నిస్థాయిలకు చెందిన పోలీసులు ఈ స్పోర్ట్స్‌అండ్‌గేమ్స్‌మీట్‌లో పాల్గొనేందుకు అర్హులు. ఆసక్తి ఉన్న క్రీడాకారుల పేర్లను నమోదుచేసే ప్రక్రియ పూర్తయింది. మహిళలు, పురుషులు, మిక్స్‌డ్‌డబుల్స్ విభాగాల్లో వివిధ రకాల క్రీడలు జరుగనున్నాయి. మహిళలకోసం కబడ్డీ, టగ్‌ఆఫ్‌వార్, బ్యాట్మింటన్ సింగిల్స్, డబుల్స్ విభాగాల్లో, క్యారమ్స్, 100మీటర్లు, 200మీటర్ల పరుగు, లాంగ్‌జంప్, షాట్‌పుట్ విభాగాల్లో నిర్వహించనుండగా పురుషుల విభాగంలో క్రికెట్, వాలీబాల్, ఫుట్‌బాల్, బాస్కెట్‌బాల్, కబడ్డీ, టగ్‌ఆఫ్‌వార్, బాట్మింటన్, క్యారమ్స్, 100మీటర్లు, 200మీటర్లు, 400మీటర్లదూరం పరుగు, లాంగ్‌జంప్, షాట్‌పుట్ విభాగాల్లో నిర్వహించనుండగా మిక్స్‌డ్‌డబుల్స్ విభాగంలో బ్యాట్మింటన్ నిర్వహించనున్నారు. స్పోర్ట్‌మీట్ ప్రారంభ, ముగింపు కార్యక్రమాలకు సంబంధించిన రిహార్సల్స్ గతవారం రోజుల నుండి కొనసాగుతున్నాయి. శుక్రవారంనాడు పోలీస్ కమిషనర్ విబి కమలాసన్‌రెడ్డి ఏర్పాట్లను ప్రత్యేకంగా పరిశీలించారు. ఈస్పోర్ట్స్ అండ్ గేమ్స్‌మీట్ శనివారం ఉదయం 09:30గంటలకు ప్రారంభంకానున్నది.

అనంతరం వివిధస్థాయిలకు చెందిన అధికారులు, వ్యాయామ ఉపాధ్యాయులతో ఏర్పాటైన కార్యక్రమంలో పోలీస్ కమిషనర్ విబి కమలాసన్‌రెడ్డి మాట్లాడుతూ అన్నిస్థాయిలకు చెందిన పోలీసు క్రీడాకారులకు మరింత ప్రోత్సాహం అందించాలనే ఉద్దేశంతో ఈ స్పోర్ట్స్‌అండ్‌గేమ్స్‌మీట్‌ను నిర్వహిస్తున్నామన్నారు. క్రీడాకారులు తమలోదాగి ఉన్న ప్రతిభను ప్రదర్శించడంతోపాటు క్రీఢాస్ఫూర్తితో వ్యవహరిస్తూ ఈ పోటీల్లో పాల్గొనాలని సూచించారు. క్రీడల్లో గెలుపుఓటములు సహజమని, క్రీడలద్వారా మానసికోల్లాసం లభిస్తుందని చెప్పారు. రాష్ట్రజాతీయ, అంతర్జాతీయ స్థాయిల్లో రాణించే క్రీడాకారులను గుర్తించి వారికి పూర్తిస్థాయి ప్రోత్సాహం అందిస్తామని పేర్కొన్నారు.

పైన పేర్కొన్న ఈ స్పోర్ట్స్ అండ్ గేమ్స్‌మీట్‌ను ఆరుడివిజన్లుగా విభజించారు. ఇందులో కరీంనగర్‌టౌన్, కరీంనగర్ రూరల్, హుజురాబాద్, కమిషనరేట్ కేంద్రం, పోలీస్ శిక్షణ కళాశాల(పిటిసి), జైళ్ళశాఖ విభాగాలు పాల్గొననున్నాయి. అన్నివిభాగాల్లోనూ తమసత్తా చాటేందుకు పోలీసులు సిద్ధమయ్యారు. ఈ స్పోర్ట్స్ అండ్ గేమ్స్‌మీట్‌కోసం గతనెలరోజుల నుండి ప్రాక్టీస్‌లను నిర్వహిస్తున్నారు. దాదాపు 400మంది పోలీసుక్రీడాకారులు ఈ స్పోర్ట్స్ అండ్ గేమ్స్‌మీట్‌లో పాల్గొనున్నారు. ఈ పోటీలను తిలకించేందుకు ప్రజాప్రతినిధులు, వివిధ విభాగాలకు చెందిన ప్రభుత్వశాఖల అధికారులు, స్వచ్ఛందసేవల ప్రతినిధులు, శాంతి,సంక్షేమకమిటి సభ్యులను ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ డిసిపిలు ఎన్ శ్రీనివాస్(ఎల్‌అండ్‌ఓ), జి చంద్రమోహన్(పరిపాలన), ఏసిపిలు పి అశోక్, జె విజయసారధి, కె శ్రీనివాస్, మదన్‌లాల్, ఎస్‌బిఐ వి శ్రీనివాస్‌లతోపాటు పలువురు పోలీసు అధికారులు, క్రీడల నిర్వాహణకు సహకరిస్తున్న వ్యాయామ ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్ర వ్యాప్తంగా భూముల డిజిటల్ సర్వే

డిజిటల్ సర్వే కోసం వెంటనే టెండర్లు పిలవాలి
ధరణితో సమస్యలు పూర్తిగా తొలిగాయి
ధరణి పోర్టల్ నూటికి నూరు పాళ్లు విజయవంతమయింది
డాక్యుమెంట్లను గోల్‌మాల్ చేసే దుర్మార్గం పోయింది
ధరణిలో నమోదైన భూములకు మాత్రమే లావాదేవీలు
పనిగట్టుకుని కొందరు వ్యతిరేక వార్తలు రాస్తున్నారు
రెవన్యూ శాఖ పేరు కూడా మార్చబోతున్నాం
-ఉన్నతస్థాయి సమీక్షలో సిఎం కెసిఆర్ వెల్లడి

హైదరాబాద్,ఫిబ్రవరి19(ఆర్ఎన్ఎ): త్వరలో రాష్ట్ర వ్యాప్తంగా భూముల డిజిటల్ సర్వే చేస్తామని సీఎం కేసీఆర్ ప్రకటించారు. డిజిటల్ సర్వే చేసి భూములకు కో-ఆర్డినేట్స్ ఇస్తామన్నారు. సర్వే కోసం వెంటనే టెండర్లు పిలవాలని కేసీఆర్ ఆదేశించారు. ధరణి పోర్టల్ 100 శాతం విజయవంతమైందని చెప్పారు. ధరణి పోర్టల్‌తో రెవెన్యూలో అవినీతి అంతమైందని ఆయన పేర్కొన్నారు. డాక్యుమెంట్లను గోల్‌మాల్ చేసే దుర్మార్గం పోయిందని, భూముల అమ్మకం, కొనుగోలు పారదర్శకంగా జరుగుతున్నాయని కేసీఆర్ తెలిపారు. ప్రభుత్వం ఇప్పటికే ప్రకటించిన విధంగా రాష్ట్ర వ్యాప్తంగా త్వరలోనే డిజిటల్ సర్వే చేసి, వ్యవసాయ భూములకు కో ఆర్డినేట్స్ ఇస్తామని ముఖ్యమంత్రి ప్రకటించారు. సర్వే కోసం వెంటనే టెండర్లు పిలవాలని సీఎం ఆదేశించారు. వ్యవసాయ భూముల రిజిస్ట్రేషన్, మ్యుటేషన్ పూర్తి పారదర్శకంగా జరగాలనే లక్ష్యంతో ప్రభుత్వం ఎంతో శ్రమించి, ప్రవేశ పెట్టి, అమలు చేస్తున్న ధరణి పోర్టల్ నూటికి నూరు పాళ్లు విజయవంతమయిందని సీఎం సంతృప్తి వ్యక్తం చేశారు. రెవెన్యూలో సంస్కరణలు తెచ్చిన ఫలితంగా, రెవెన్యూ శాఖ పని విధానంలో సమూల మార్పులు చోటు చేసుకున్నాయని, ఈ నేపథ్యంలో ఆ శాఖ అధికారులు భవిష్యత్తులో నిర్వహించాల్సిన విధులకు సంబంధించి జాబ్ చార్టు రూపొందించనున్నట్లు వెల్లడించారు. రెవెన్యూ సంస్కరణలు, ధరణి పోర్టల్ పనితీరుపై ముఖ్యమంత్రి కేసీఆర్ గురువారం ప్రగతి భవన్‌లో సమీక్ష నిర్వహించారు. ప్రభుత్వ ముఖ్య సలహాదారు రాజీవ్ శర్మ, సీఎస్ సోమేశ్ కుమార్, ముఖ్య కార్యదర్శి నర్సింగ్ రావు, కార్యదర్శులు స్మితా సభర్వాల్, భూపాల్ రెడ్డి తదితరులు హాజరయ్యారు. ఈ సందర్భంగా పలు నిర్ణయాలను సీఎం ప్రకటించారు. ధరణి పోర్టల్ వల్ల రెవెన్యూలో అవినీతి అంతమయిందని, నోరులేని, అమాయకుల రైతులకు న్యాయం జరిగిందన్నారు. ఒకరి భూమిని ఇంకొకరి పేరు మీద రాసే అరాచకం ఆగిందన్నారు. జుట్టుకు జుట్టుకు ముడేసి పంచాయతీ పెట్టే దుష్ట సంప్రదాయం ఆగింది. డాక్యుమెంట్లు గోల్ మాల్ చేసి, రెవెన్యూ కోర్టుల పేరిట జరిగే దుర్మార్గం పోయింది. దేశంలో మరెక్కడా లేని విధంగా, చరిత్రలో ఎన్నడూ జరగని విధంగా ప్రభుత్వం ఎన్నో వ్యయ, ప్రయాసలకోర్చి మూడేళ్లు కసరత్తు చేసి కొత్త చట్టం తెచ్చింది. ఎలాంటి గందరగోళం, అస్తవ్యస్తం లేకుండా భూముల అమ్మకాలు, కొనుగోళ్ల పక్రియ సజావుగా సాగుతున్నది. బయోమెట్రిక్, ఆధార్ ఆధారంగా అమ్మేవారు, కొనేవారు వస్తేనే భూముల రిజిస్ట్రేషన్ జరుగుతున్నది. ధరణిలో నమోదైన భూములను మాత్రమే అమ్మే, కొనే వీలున్నది. ఆ భూములు మాత్రమే వారసత్వం ద్వారా, గిఫ్ట్ డీడ్ ద్వారా మరొకరికి సంక్రమించే అవకాశం ఉన్నదన్నారు. ప్రభుత్వం అనుసరిస్తున్న పకడ్బందీ వ్యూహం వల్ల ఎవరూ ధరణిలో వేలుపెట్టి మార్పులు చేసే అవకాశం లేదు. చివరికి సీసీఎల్ఏ, సీఎస్ కూడా రికార్డులను మార్చలేరు. రిజిస్ట్రేషన్ పక్రియ ఇంత సజావుగా సాగడం కొందమందికి మింగుడు పడడం లేదు. ధరణి పోర్టల్ మీద చిలువలు, పలువలు ప్రచారం చేస్తున్నారు. అసంబద్ధమైన విషయాలు మాట్లాడుతున్నారు. లేని సమస్యలు సృష్టించి, పైరవీలు చేసి అక్రమంగా సంపాదించుకునే వారు ఇప్పుడు అవకాశం లేకపోవడంతో ఆందోళన చెందుతున్నారు. వారే అపోహలు సృష్టించి గందరగోళ పరిచే ప్రయత్నాలు చేస్తున్నారు. వాటికి ప్రజలు తికమక పడొద్దు. కొన్ని పత్రికలు కావాలని తప్పుడు వార్తలు, అసంబద్ధమైన కథనాలు ప్రచురిస్తున్నాయన్నారు. ఈ వార్తలపై కలెక్టర్లు ఎప్పటికప్పుడు స్పందించి సంపూర్ణ వివరాలు అందించాలని సందేహాలను నివృత్తి చేయాలని ముఖ్యమంత్రి చెప్పారు. తాను అసెంబ్లీలో ఇంతకుముందే ప్రకటించినట్లు త్వరలోనే రాష్ట్ర వ్యాప్తంగా డిజిటల్ సర్వే నిర్వహిస్తాం. ప్రతీ భూమికి కో ఆర్డినేట్స్ ఇస్తాం. వాటిని ఎవరూ మార్చలేరు. గందరగోళానికి, తారుమారు చేయడానికి ఆస్కారం ఉండదు. నిజానికి ఇప్పటికే డిజిటల్ సర్వే ప్రారంభం కావాల్సింది. కరోనా వల్ల ఆగింది. అతి త్వరలోనే డిజిటల్ సర్వే ప్రారంభం అవుతుంది. ఒకసారి సర్వే పూర్తయితే అన్ని విషయాలపై స్పష్టత వస్తుంది. రైతుల భూముల మధ్య, అటవీ- ప్రభుత్వ భూముల మధ్య, అటవీ-ప్రైవేటు భూముల మధ్య హద్దుల పంచాయతీ కూడా పరిష్కారం అవుతుంది. పోడు భూముల సమస్య కూడా పరిష్కారం అవుతుంది. 3-4 నెలల్లో మొత్తం సమస్యలు కొలిక్కి వస్తాయి. కో ఆర్డినేట్స్ మారవు కాబట్టి భవిష్యత్తులో కూడా హద్దుల పంచాయతీకి అవకాశం ఉండదు. భూ రికార్డులు సక్రమంగా ఉన్న దేశాల్లో జీడీపీ 3 నుంచి 4 శాతం వృద్ధి సాధించింది. తెలంగాణ రాష్ట్రంలో కూడా అలాంటి విప్లవాత్మక మార్పుకు ప్రభుత్వం సిద్ధపడిందని సీఎం అన్నారు. మారిన పరిస్థితుల్లో రెవెన్యూ స్వరూపం కూడా మారింది. రెవెన్యూ శాఖ విధులు, బాధ్యతల్లో మార్పులు వచ్చాయి. గతంలో భూమి శిస్తు వసూలు చేసినప్పుడు రెవెన్యూ అనే పదం, శాఖ వచ్చాయి. ఇప్పుడు రెవెన్యూ వసూలు చేయకపోగా, ప్రభుత్వమే రైతుబంధు ద్వారా ఎకరానికి ఏటా రూ.10 వేల సాయం అందిస్తున్నది. కాబట్టి రెవెన్యూ అనే పేరు కూడా ఇప్పుడు సరిపోదు. పేరు మారే అవకాశం ఉందన్నారు. రెవెన్యూ శాఖలో ఎవరేమి పని చేయాలనే విషయంలో ప్రభుత్వం త్వరలోనే జాబ్ చార్టు రూపొందిస్తుంద న్నారు. ఆర్ఐ ఏం చేయాలి? తహసిల్దార్ ఏం చేయాలి? ఆర్డీవో ఏం చేయాలి? అనే విషయాల్లో స్పష్టత ఇస్తాం. రెవెన్యూ అధికారులను పనిచేయగలిగే, పని అవసరం ఉండే చోట ప్రభుత్వం వాడుకుంటుందని సీఎం కేసీఆర్ ప్రకటించారు. ఏమైనా సమస్యలు, సందేహాలుంటే రైతులు ఇకపై కలెక్టర్లకు దరఖాస్తు చేసుకోవాలి. కలెక్టర్లు ఆ దరఖాస్తులను స్వీకరించి, పరిశీలించాలి. ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి నుంచి వచ్చే మార్గదర్శకాలకు అనుగుణంగా వాటిని పరిష్కరించాలని సీఎం పేర్కొన్నారు.

అంగన్‌వాడీల్లో మిల్లెట్స్, చిక్కీలు: మంత్రి సత్యవతి

మంచిర్యాల,ఫిబ్రవరి19(ఆర్ఎన్ఎ): రాష్ట్రంలోని అంగన్‌వాడీ కేంద్రాలకు పాలు, గుడ్లు, పప్పులు, నూనెలు, నిత్యావసరాలు క్రమం తప్పకుండా, నాణ్యత లోపించకుండా సరఫరా చేసేలా తగిన ఏర్పాట్లు చేస్తునాన్నమని మంత్రి సత్యవతి రాథోడ్ అన్నారు. పిల్లల్లో పోషకాహార లోపం ఉందని ఒక సర్వేలో తేలిందని, దీనిని అధిగమించడానికి నివారించాలని ఆదేశించారు. పోషకాహార లోపాన్ని నివారించేందుకు అధ్యయనం చేస్తున్నామని చెప్పారు. త్వరలో పిల్లలకు కూడా పాలు ఇచ్చే ఆలోచన ఉందని, పిల్లల పెరుగుదలను ఎప్పటికప్పుడు రికార్డ్ చేసే విధంగా గ్రోత్ మానిటర్ కార్డ్స్ ఇస్తున్నాని వెల్లడించారు. మి÷-లలెట్స్ బ్రేక్‌ఫాస్ట్, చిక్కీలు ఇచ్చే ఆలోచన కూడా ఉందన్నారు.అంగన్‌వాడీలకు సరఫరా చేసే గుడ్లు 50 గ్రాముల కంటే తక్కువ ఉండొద్దనే నిబంధన విధించామని చెప్పారు. దీనికి విరుద్ధంగా చిన్న గుడ్లను సరఫరా చేస్తే కాంట్రాక్టర్లను బ్లాక్‌లిస్ట్‌లో పెడుతామని, దానికి అధికారులను బాధ్యులు చేస్తామని హెచ్చరించారు. మంచిర్యాల జిల్లా గిరిజన, మహిళాభివృద్ధి, శిశు సంక్షేమ శాఖల అధికారుతో మంత్రి సమీక్షా సమావేశం నిర్వహించారు. టీఆర్ఎస్ ప్రభుత్వం వచ్చాకే గిరిజన సంప్రదాయాలు, పండగలు, జాతరలకు ప్రాధాన్యత లభించిందని చెప్పారు. గతంలో ఏ పాలకులు కూడా గిరిజనులను పట్టించుకోలేదని విమర్శించారు. జాతరలను అధికారికంగా నిర్వహించేందుకు సీఎం కేసీఆర్ నిధులు కేటాయిస్తున్నారని వెల్లడించారు. గ్రామ పంచాయతీలు కొత్తగా ఏర్పడిన నేపథ్యంలో నూతన అంగన్‌వాడీలలో సిబ్బంది నియామకానికి సంబంధించి ప్రతిపాదనలు పంపించాలని సూచించారు. అంగన్‌వాడీలకు వచ్చే పాలను విజయ డైరీ నుంచి తీసుకుంటున్నామని వెల్లడించారు. ఇకపై ఎలాంటి సమస్యలు లేకుండా సరఫరా జరుగుతుందని చెప్పారు.

సూర్యనారాయణ స్వామి ఆలయానికి పోటెత్తిన భక్తులు

అరసవల్లి,బ్రవరి19(ఆర్ఎన్ఎ): అరసవల్లి సూర్యనారాయణ స్వామి దేవస్థానంలో రథసప్తమి వేడుకలు వైభవంగా ప్రారంభమయ్యాయి. తొలుత విశాఖ శారదాపీఠం ఉత్తర పీఠాధిపతి స్వాత్మానందేంద్ర సరస్వతిస్వామి, ఆలయ ధర్మకర్త ఇప్పిలి జోగి సన్యాసిరావు, దేవా దాయ శాఖ డిప్యూటీ కమిషనర్ ఎన్.సుజాత స్వామికి పట్టువస్త్రాలు సమర్పించారు.

వేదపండితుల వేదమంత్రోచ్ఛరణల మధ్య స్వామికి మహాక్షీరాభిషేకం జరిగింది. స్వామివారి నిజరూపాన్ని వీక్షించేందుకు రాత్రి నుంచే క్యూలైన్లలో భక్తులు బారులుదీరారు.

ఏటా మాఘశుద్ధ సప్తమిని రథసప్తమి పర్వది నంగా, సూర్య జయంతిగా భక్తజనులు ఘనంగా జరుపుకోవడం సంప్రదాయంగా వస్తోంది. అరసవల్లి సూరీడు అందరి దేవు డు. అందుకే అనాది నుంచి ఏడాదికోమారు ఈ రోజున సూర్య భగవానుని నిజరూప దర్శనం భక్తులకు మరపురాని మధురాను భూతిని కలిగించే ఘట్టంగా నిలుస్తోంది.

మార్చిలో దివ్యాంగులకు కరోనా వ్యాక్సిన్: వినోద్

హైదరాబాద్,ఫిబ్రవరి19(ఆర్ఎన్ఎ): రాష్ట్రంలోని వికలాంగులకు మార్చి నెలలో కొవిడ్ వ్యాక్సిన్ టీకాలు వేయనున్నామని, ఈ మేరకు రాష్ట్ర వైద్యారోగ్యశాఖ మంత్రి ఈటల రాజేందర్ అంగీకారం తెలిపినట్లు రాష్ట్ర ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడు బోయినపల్లి వినోద్ కుమార్ వెల్లడించారు. శుక్రవారం మంత్రుల నివాసంలో వినోద్ కుమార్‌ను జాతీయ వికలాంగుల హక్కుల ఫోరం అధ్యక్షుడు కొల్లి నాగేశ్వర్ రావు, రాష్ట్ర అధ్యక్షుడు జెరిపోతుల పరశురాం కలిసి ఈ మేరకు వినతిపత్రాన్ని అందజేశారు. వికలాంగుల హక్కుల ఫోరం విజ్ఞప్తి మేరకు మంత్రి ఈటల రాజేందర్‌తో వినోద్ కుమార్ మాట్లాడారు. దీంతో వికలాంగులకు మార్చి నెలలో కొవిడ్ వ్యాక్సిన్ టీకాలు వేసేందుకు మంత్రి ఈటల అంగీకరించారు.

సచివాలయానికి సరికొత్త హంగులు

పార్లమెంట్,రాష్ట్రపతి భవన్‌లను పరిశీలించిన వేముల

హైదరాబాద్,ఫిబ్రవరి19(ఆర్ఎన్ఎ): తెలంగాణ ప్రభుత్వం నూతనంగా నిర్మిస్తున్న సచివాలయ భవనానికి నగిషీలు దిద్దేందుకు ముఖ్యమంత్రి ఆదేశాలకు మేరకు పార్లమెంట్, రాష్ట్రపతి భవన్‌కు వినియోగించిన రాళ్లను, నిర్మాణ డిజైన్లను పరిశీలించేందుకు శాసనసభ వ్యవహారాలు, రోడ్లు-భవనాలశాఖ మంత్రి మంత్రి వేముల ప్రశాంత్ రెడ్డి అధికారులతో కలిసి ఢిల్లీకి వెళ్లారు. శుక్రవారం హస్తినా పర్యటనలో మంత్రి బిజీబిజీగా గడిపారు. ఉదయం అధికారులతో ఆయన పార్లమెంట్, రాష్ట్రపతి భవన్‌లో సౌత్, నార్త్ బ్లాక్‌లో నిర్మాణాలను వీక్షించారు.పార్లమెంట్ భవనం నిర్మాణంలో వినియోగించిన రెడ్‌స్టోన్‌ని పరిశీలించారు. పార్లమెంట్ ఎదుట ఫౌంటెయిన్‌లను, రాష్ట్రపతి భవన్‌లో ఉన్న వివిధ రకాల రాతి నిర్మాణాలు, ఉపయోగించిన రాతి రకాలు, ఫౌంటెయిన్‌లు, అశోక హాల్‌ను తిలకించారు. మంత్రి వెంట ఆర్‌అండ్‌బీ ఈఎన్‌సీ గణపతి రెడ్డి, ఈఈ శశిధర్, ఆర్కిటెక్ట్ ఆస్కార్, షాపూర్ జీ సంస్థ ప్రతినిధి లక్ష్మణ్ పలువురు అధికారులు ఉన్నారు.

అన్నదాతల సంక్షేమమే కెసిఆర్ లక్ష్యం

-అధ్యయన కేంద్రాలుగా రైతువేదికలు: కొప్పుల

జగిత్యాల,ఫిబ్రవరి19(ఆర్ఎన్ఎ): రైతు వేదికలు అధ్యయన కేంద్రాలుగా భాసిల్లాలని సంక్షేమశాఖ మంత్రి కొప్పుల ఈశ్వర్ అన్నారు. దేశంలో ఎక్కడాలేని విధంగా అన్నదాతల సంక్షేమానికి అనేక పథకాలను అమలు చేస్తున్న ఘనత సీఎం కేసీఆర్ సర్కారుకే దక్కిందని పేర్కొన్నారు. జగిత్యాల అర్బన్ మండలంలోని అంబారిపేట, రూరల్ మండలంలోని పొలాస, పొరండ్ల, క్లలెడ సారంగాపూర్ మండలంలోని కోనాపూర్, బీర్‌పూర్ మండలంలోని బీర్‌పూర్, కండ్లపల్లి గ్రామాల్లో జగిత్యాల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కుమార్, జడ్పీ చైర్‌పర్సన్ దావ వసంతతో కలిసి రైతు వేదికలను ప్రారంభించారు.

ఆయాచోట్ల ఏర్పాటు చేసిన సమావేశాల్లో మంత్రి మాట్లాడారు. రైతుల బాగుతోనే రాష్ట్రం బాగుంటుందనే ఉద్దేశంతో ప్రభుత్వం వ్యవసాయం అభివృద్ధికి చర్యలు తీసుకుంటున్నదని చెప్పారు. సమైక్య పాలనలో విత్తనాలు దొరక్క, కరెంట్‌రాక, నీళ్లు లేక పంటలు ఎండిపోయి రైతులు ఆత్మహత్యలు చేసుకున్నారన్నారు. కానీ కేసీఆర్ ప్రభుత్వం 24 గంటల ఉచిత కరెంట్, ప్రతి ఎకరాకు సాగునీరందించేందుకు ప్రాజెక్టులను నిర్మించిందని చెప్పారు. ఎమ్మెల్సీ కవిత, తాను సీఎం దృష్టికి తీసుకెళ్లి రోళ్లవాగు ప్రాజెక్ట్ ఆధునీకరణకు నిధులు మంజూరు చేయించామని చెప్పారు. ఆరు సంవత్సరాల్లో కేంద్ర ప్రభుత్వం రైతాంగం, ఎస్సీ, ఎస్టీ, బీసీ వర్గాలకు చేసిందేమీ లేదన్నారు. ఆయా కార్యక్రమాల్లో జగిత్యాల కలెక్టర్ గుగులోతు రవి, జేడీఏ సురేశ్, ఆర్డీఎస్ జిల్లా కోఆర్డినేటర్ వెల్ముల రమణ తదితరులు పాల్గొన్నారు.

వినోద్‌తో బ్రిటిష్ హై కమిషనర్ భేటీ

-రాష్ట్రంలో అమలు చేస్తున్న కార్యక్రమాలపై ఆసక్తి

హైదరాబాద్,ఫిబ్రవరి19(ఆర్ఎన్ఎ): రాష్ట్ర ప్రణాళికా సంఘం వైస్ చైర్మన్ బోయినపల్లి వినోద్ కుమార్‌తో హైదరాబాద్‌లో బ్రిటీష్ డిప్యూటీ హై కమిషనర్ డాక్టర్ ఆండ్రూ ప్లెమింగ్ భేటీ అయ్యారు. గురువారం నగరంలోని మంత్రుల నివాస

హాజరైన మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి

నల్లగొండ,ఫిబ్రవరి19(ఆర్ఎన్ఎ): చెర్వుగట్టు శ్రీ పార్వతీ జడల రామలింగేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలు ప్రారంభం అయ్యాయి. ఆరు రోజుల ఉత్సవాల నిర్వహణకు ఘనంగా ఏర్పాట్లు చేశారు. లక్షలాదిగా తరలివచ్చే భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలుగకుండా వసతులు కల్పిస్తున్నారు.రెండో శ్రీశైలంగా పేరొందిన నార్కట్‌పల్లి మండలం చెర్వుగట్టు శ్రీ పార్వతి జడల రామలింగేశ్వర స్వామి ఆలయంలో ఆరు రోజుల పాటు వార్షిక బ్రహ్మోత్సవాలు నిర్వహించనున్నారు. చెర్వుగట్టులో బ్రహ్మోత్సవాలను శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి, మండలి డిప్యూటీ చైర్మన్ నేతి విద్యాసాగర్, ఎంపీ బడుగుల లింగయ్య యాదవ్ శుక్రవారం ప్రారంభించారు. శనివారం తెల్లవారు జామున స్వామి వారి కల్యాణం జరగనుంది. భక్తులు భారీగా హాజరు కానున్నారు. ఇప్పటికే నూతనంగా మరుగుదొడ్లు, మంచినీటి ట్యాంకులు, చలువ పందిళ్లను సిద్ధం చేశారు. దేవస్థానాన్ని విద్యుత్ దీపాలతో అలంకరించారు. గుట్టపైకి వెళ్లేదారిలో ఇరువైపులా రెయిలింగ్ నిర్మించారు. గట్టు కింద ఆలయాలను విద్యుత్ కాంతులతో అలంకరించారు. నార్కట్‌పల్లి-అద్దంకి జాతీయ రహదారి నుంచి గట్టు వరకు విద్యుల్లతలు, గట్టు కింద శివుడి రూపంలో విద్యుత్ లైట్లతో భారీ కటౌట్లు కూడా పెట్టారు. కొబ్బరికాయలు, లడ్డూలు, పులిహోర ప్యాకెట్లు సిద్ధం చేశారు. వాహనాల పార్కింగ్ కోసం స్థలం కేటాయించారు. కరోనా నేపథ్యంలో భక్తుల భద్రతకు పెద్దపీట వేశారు. పోలీస్ బందోబస్తుతో పాటు ఆర్టీసీ బస్సులను ప్రత్యేకంగా నడుపనున్నారు. కల్యాణ మండపం విద్యుత్ దీపాలతో విరాజిల్లుతుంది. మండపానికి వివిధ రకాల రంగులతో విద్యుత్ దీపాలు ఏర్పాటు చేయడంతో భక్తులను ప్రత్యేకంగా ఆకట్టుకుంటుంది. ఉత్సవాల్లో భాగంగా శనివారం తెల్లవారు జామున స్వామివారి కల్యాణాన్ని ఘనంగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు చేశారు. స్వామివారి కల్యాణానికి శాసన మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి, మంత్రి గుంటకండ్ల జగదీశ్‌రెడ్డి, నకిరేకల్ ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య ప్రభుత్వం తరఫున తలంబ్రాల బియ్యం, పట్టు వస్త్రాలు సమర్పిస్తారని ఆలయ చైర్మన్ మేకల అరుణారాజిరెడ్డి, ఈఓ మహేంద్రకుమార్ తెలిపారు. ఉత్సవాల కోసం దేవస్థానంతో పాటు వివిధ శాఖలు కూడా ఏర్పాట్లను పూర్తి చేశాయి. పంచాయతీ సిబ్బంది పారిశుధ్య నిర్వహణలో పాల్పంచుకోనున్నారు. వైద్య శిబిరాలతో పాటు విద్యుత్ శాఖ ప్రత్యేకంగా ట్రాన్స్‌ఫార్మర్లను ఏర్పాటు చేసింది. లక్షలాదిగా భక్తులు తరలివస్తారన్న అంచనాల మేరకు ప్రస్తుతం 2లక్షలకు పైగా లడ్డూలను సిద్ధం చేశారు. లోక కల్యాణార్థం పరశురాముడు ప్రతిష్ఠించిన 108క్షేత్రాల్లో చివరిదిగా చెర్వుగట్టుగా ప్రసిద్ధికెక్కింది. శివలింగం జడల ఆకృతిని పోలి ఉండడంతో పార్వతీజడల రామలింగేశ్వర స్వామిగా పేరొందాడు. పశ్చిమాభి ముఖంతో శివుడు కొలువై ఉండడం ఈ క్షేత్రం ప్రత్యేకత. గుట్ట కింద పార్వతీదేవి ఆలయం నిర్మితమై ఉన్నది. ఎత్తైన మూడు గుండ్లపై శివలింగాన్ని దర్శించుకుంటే కోరికలు తీరుతాయని భక్తుల నమ్మకం. దీంతో గంటల కొద్దీ క్యూలైన్లలో వేచి ఉండి స్వామి వారికి క్షీరాభిషేకం చేస్తుంటారు. ఇక ప్రతి అమావాస్య రోజున భక్తుల తాకిడి అధికంగా ఉంటుంది. మానసిక రుగ్మతలతో బాధపడే భక్తులు ఈ క్షేత్రంపై మండల దీక్ష పూర్తిచేస్తే సంపూర్ణ ఆరోగ్యవంతులవుతారని విశ్వాసం. ముడుపులు చెల్లించి స్వామి వారి పాదుకలను తమ శిరస్సుపై ధరించి ప్రదక్షిణ చేస్తుంటారు.

అంతర్వేది నారసింహుడికి కొత్తరథం

-రథసప్తమి సందర్భంగా ప్రారంభించిన సిఎం

కాకినాడ,ఫిబ్రవరి19(ఆర్ఎన్ఎ):తూర్పుగోదావరి జిల్లా అంతర్వేది నూతన రథాన్ని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి శుక్రవారం ప్రారంభించారు. ఉదయం 11.30 గంటల సమయంలో అంతర్వేది ఫిషింగ్ హార్బర్ హెలిప్యాడ్‌కు చేరుకున్న సీఎం... అక్కడ నుంచి శ్రీ లక్ష్మి నరసింహస్వామి ఆలయ రాజగోపురం వద్దకు చేరుకున్నారు. సీఎం వైఎస్ జగన్‌కు వేదపండితులు ఆశీర్వచనం అందించారు. స్వామి వారిని దర్శించుకున్న సీఎం.. అనంతరం అర్చన, మంత్రపుష్పం సమర్పణ కార్యక్రమాల్లో పాల్గొన్నారు. అనంతరం కోటి రూపాయల వ్యయంతో నిర్మించిన నూతన రథాన్ని ఆయన ప్రారంభించారు. నూతన రథం వద్ద ప్రత్యేక పూజలు చేసిన ముఖ్యమంత్రి.. భక్తులతో కలిసి నూతన రథాన్ని తాడుతో లాగారు.

40 అడుగుల ఎత్తులో ఏడు అంతస్తులతో రూపుదిద్దుకున్న నూతన రథాన్ని కొత్త హంగులు, రక్షణ ఏర్పాట్లతో నిర్మాణం చేపట్టారు. 1,330 ఘనపుట డుగుల బస్తర్ టేకుతో నూతన రథం నిర్మాణం జరిగింది. రికార్డ్ స్థాయిలో 3 నెలల కాలంలోనే నూతన రథాన్ని నిర్మించారు.

లడ్డూ తీసుకోండి.. మాకు ఓటువేయండి

ఎన్నికల ప్రచారంలో శ్రీవారిప్రసాదం పంపిణీ

వైకాపా తీరుపై మండిపడ్డ టిడిపి నేత అచ్చెన్నాయుడు

తిరుపతి,ఫిబ్రవరి19(ఆర్ఎన్ఎ): చిత్తూరు జిల్లా పంచాయతీ ఎన్నికల్లో వైసీపీ నేతలు ఒక్కో ప్రాంతంలో ఒక్కో విధానాన్ని అమలు చేస్తున్నారు. తిరుపతి ప్రాంతంలో దేవుడి పేరిట ఓట్ల రాజకీయాలు చేస్తున్నారు. చంద్రగిరి నియోజకవర్గం, తొండవాడ పంచాయతీలో ఎన్నికల కోసం దేవుడికి కూడా రాజకీయాలు అంటగడుతున్నారు. తిరుపతి వెంకన్నకు తెలుగు రాష్ట్రాల్లోనే కాదు దేశ విదేశాల్లోనూ భక్తులు ఉన్నారు. తిరుపతి లడ్డూకి ప్రపంచ వ్యాప్తంగా ప్రత్యేక గుర్తింపు ఉంది. ఇప్పుడు దాన్ని కూడా వైసీపీ నేతలు క్యాష్ చేసుకుంటున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. చంద్రగిరి నియోజకవర్గం, తొండవాడ పంచాయతీ ఎన్నికల ప్రచారంలో ఓటర్ స్లిప్‌తోపాటు శ్రీవారి లడ్డూలను పంచిపెడుతున్నారు. 'లడ్డూ తీసుకోండి.. మాకు ఓటువేయండి' అని అంటున్నారు. తొండవాడలో ఓటర్లకు శ్రీవారి లడ్డూలు పంపిణీ చేసేందుకు రేషన్ సరఫరా చేసే వాహనాలను ఉపయోగిస్తున్నారు. కరోనా తర్వాత తిరుమలకు భక్తులు పోటెత్తుతున్నారు. అక్కడ స్వామివారి లడ్డూలు దొరక్కా భక్తులు ఇబ్బందిపడుతున్నారు. వైసీపీ నేతలకు మాత్రం లడ్డూలకు కరువేలేదు. దర్జాగా తిరుమల నుంచి తీసుకువచ్చి పంచుతున్నారు. ఈ వ్యవహారంపై అధికారులు చూసీ, చూడనట్లు వ్యవహరిస్తున్నారు. అన్ని ప్రయత్నాలు అయిపోయాయి. ఇక దేవుడ్ని కూడా రాజకీయాల్లోకి దింపారంటూ.. వైసీపీ నేతల తీరుపై ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. చంద్రగిరి మండలం తొండవాడ పంచాయతీలో ఎన్నికల ప్రచారానికి శ్రీవారి ప్రసాదంతో పాటు ఓటర్ స్లిప్పులు అందజేస్తూ అధికార పార్టీ నేతలు దేవుడితో రాజకీయం చేస్తున్నారు. తిరుమలలో భక్తులకు ప్రీతిపాత్రమైన లడ్డూ ప్రసాదాన్ని ఓటర్లకు పంచడం వివాదంగా మారింది. ఓటు బ్యాంకు రాజకీయం కోసం శ్రీవారి లడ్డూను తీసుకువచ్చి తొండవాడ పంచాయతీలో వైసీపీ మద్దతుదారులు పంచుతుండడం విశేషంగా మారింది. పంచాయతీ ఎన్నికల ప్రచారంలో వైసీపీ నేతలు శ్రీవారి లడ్డు ప్రసాదాన్ని వినియోగించడంపై టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు అచ్చెన్నాయుడు తీవ్రస్థాయిలో ఆగ్రహం వ్యక్తం చేశారు. పంచాయతీ ఎన్నికల్లో తిరుమల ప్రసాదాన్ని ప్రలోభాలకు వినియోగించడం దిగజారుడుతనమని వ్యాఖ్యానించారు. టీటీడీ ప్రతిష్టకు భంగం కలిగేలా వ్యవహరిస్తున్నారన్నారు.

ప్రతి ఇంటికీ గులాబీ జెండా మా లక్ష్యం -వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ గడ్డం హనుమాన్

రాజన్న సిరిసిల్ల, ఫిబ్రవరి 19 : (నేటినిజం ప్రతినిధి):ప్రత్యేక తెలంగాణ రాష్ట్రాన్ని సాధించిన తెరాస పార్టీ తెలంగాణ ప్రజల ఇంటి పార్టీగా మారింది అని వేములవాడ వ్యవసాయమార్కెట్ కమిటీ చైర్మన్ గడ్డం హనుమాన్లుఅన్నారు . శుక్రవారంవేములవాడ అర్బన్ మరి పెల్లి గ్రామంలో టీఆర్ఎస్ పార్టీ సభ్యత్వ కార్యక్రమాన్ని గడ్డం హనుమాన్లు, ఏనుగు మనోహర్ రెడ్డి ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలో దేశంలో ఎక్కడలేని విధంగా ప్రజా సంక్షేమ అభివృద్ధి పథకాలను రాష్ట్ర ముఖ్యమంత్రి కేసీఆర్, రాష్ట్ర పురపాలక శాఖ మంత్రి కేటిఆర్ నేతృత్వంలోని అమలుపరుస్తున్నారని అన్నారు. సీనియర్ టీఆర్ఎస్ నాయకుడు ఏనుగు మనోహర్ రెడ్డి మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం అమలు చేసిన సంక్షేమ అభివృద్ధి పథకాలను ప్రతి గడపకు తీసుకువెళ్లి తెరాస పార్టీని మరింత బలోపేతం చేయాల్సిన బాధ్యత తెరాస నాయకులపై ఉందన్నారు. ప్రతి ఇంటికీ గులాబీ జెండా అనే నినాదంతో ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. ప్రతి గడపకు టీఆర్ఎస్ పార్టీని తీసుకువెళ్లాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జడ్పీటీసీ ఎశ తిరుపతి, సర్పంచ్ మల్లేశం, మాజీ ఎంపీటీసీ గోస్కుల రవి, పార్టీ గ్రామశాఖ అధ్యక్షుడు ఇల్లందుల లచ్చయ్య , టీఆర్ఎస్ నాయకులు బత్తుల ఎల్లయ్య ,ఇల్లెందు లలచ్చయ్య , రాచర్ల మహేందర్ ,బాల కిషన్ తదితరులు పాల్గొన్నారు.

పేదలకు అండగా తెలంగాణ ప్రభుత్వం : మంత్రి కొప్పుల

జగిత్యాల, ఫిబ్రవరి 19 : పేదలకు తెలంగాణ ప్రభుత్వం అన్నివిధాలా అండగా ఉంటుందని సంక్షేమశాఖ మంత్రి కొప్పుల ఈశ్వర్ అన్నారు. జగిత్యాల జిల్లా బుగ్గారం, వెల్గటూర్, ధర్మారం, గొల్లపల్లి మండలాల్లోని 81మంది లబ్ధిదారులకు సీఎం సహాయనిధి నుంచి మంజూరైన రూ. 26 లక్షల 22వేల విలువైన చెక్కులను కరీంనగర్‌లోని తన క్యాంపు కార్యాలయంలో లబ్ధిదారులకు ఆయన పంపిణీ చేసి మాట్లాడారు. పేదల అభ్యున్నతికి తెలంగాణ ప్రభుత్వం అనేక సంక్షేమ పథకాలు, కార్యక్రమాలు అమలు చేస్తున్నదని పేర్కొన్నారు.

అనారోగ్యంతో బాధపడుతూ కార్పొరేట్‌స్థాయి వైద్యం చేయించుకోలేని వారికి సీఎం సహాయనిధి ద్వారా సీఎం కేసీఆర్ భరోసానిస్తున్నారని పేర్కొన్నారు. వెల్గటూర్ మండలంలో 33 మంది లబ్ధిదారులకు రూ. 1,21, 500, ధర్మారం మండలంలో 23 లబ్ధిదారులకు రూ.6,86,000 బుగ్గారం మండలంలో 14 లబ్ధిదారులకు రూ. 4,04,500గొల్లపల్లి మండలంలో 11 లబ్ధిదారులకు రూ.3,16,500 మంజూరైనట్లు తెలిపారు. పేద, మధ్య తరగతి ప్రజలు సీఎం సహాయనిధిని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

సిమెంట్, ఉక్కు పరిశ్రమలలో అనైతిక పద్ధతులను నిరసిస్తూ, ఈనెల 12 (బిఎఐ) నిర్వహించిన ధర్నా

హైదరాబాద్, ఫిబ్రవరి, 19: సిమెంట్ ఉక్కు తయారీదారుల కార్టెల్లింగ్ మరియు అనహజమైన ధరల పెరుగుదల, నిర్మాణంలో వాటాదారులు, బిల్డర్స్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా (బిఎఐ) ప్రాతినిధ్యం వహిస్తున్న భవన నిర్మాణ పరిశ్రమ దేశవ్యాప్తంగా ధర్నా మరియు ఫిబ్రవరి 12 శుక్రవారం ఒక రోజు సమ్మెను నిర్వహించింది. 2021 బెదిరింపు వైపు ప్రభుత్వ అధికారుల దృష్టిని ఆకర్షించడానికి. చివరకు సామాన్యులకు ఆటంకం కలిగించే అనారోగ్య మరియు అనైతిక పద్ధతులను అరికట్టడానికి సిమెంట్ మరియు ఉక్కు పరిశ్రమలో రెగ్యులేటరీ అథారిటీని వెంటనే నియమించాలని డిమాండ్ చేస్తోంది.

జనవరి 13, 2021 ఫిబ్రవరి 4, 2021 **(బిఎఐ)** యొక్క ఆఫీసు బేరర్ల సమావేశాలలో నిర్ణయించినట్లుగా, దేశంలోని దాని వాటాదారులందరికీ ధర్నా మరియు ఒక రోజు సమ్మెకు పిలుపునిచ్చారు. 2021 ఫిబ్రవరి 12 న నిరసన ధర్నా మరియు సమ్మెను నిర్వహించాలని ఃంఎ అన్ని కేంద్రాల ఆఫీసు బేరర్లు, మేనేజింగ్ కమిటీ మరియు జనరల్ కౌన్సిల్ సభ్యులకు తెలియజేసింది. తదనుగుణంగా సైట్లలో స్టాప్ వర్క్‌తో ధర్నా మరియు సమ్మె ఉదయం 10 నుండి మధ్యాహ్నం 1 గంటల వరకు గమనించబడింది. సంబంధిత ప్రభుత్వాల రాష్ట్ర అధికారులకు ముందస్తు సమాచారం

సిమెంట్ మరియు స్టీల్ కంపెనీల కార్టెలింగ్ మరియు అసహజమైన ధరల పెరుగుదలకు వ్యతిరేకంగా ఃంఎ వివిధ ఫోరమ్లలో నిరంతరం తన గొంతును పెంచుతోంది. ఇది న్యాయ పోరాటం చేస్తోంది మరియు అనైతిక పద్ధతులకు వ్యతిరేకంగా ప్రభుత్వ అధికారులను సంప్రదించింది. చివరకు సామాన్య ప్రజలను చిటికెడు మరియు దేశ వృద్ధికి ఆటంకం కలిగించే చెడు పద్ధతులను అరికట్టడానికి రంగాలకు నియంత్రణ అధికారం యొక్క రాజ్యాంగాన్ని బిఎఐ గట్టిగా కోరింది.

విజయవాడలో ఇంటింటి ప్రచారంలో పాల్గొన్న కేశినేని నాని

విజయవాడ,ఫిబ్రవరి19(ఆర్ఎన్ఎ): మున్సిపల్ కార్పొరేషన్ ఎన్నికల సందర్భంగా హోరాహోరీగా ప్రచారాలు నిర్వహిస్తున్నారు. 48 వ డివిజన్ కార్పొరేటర్ అభ్యర్థికి మద్దతుగా ఎంపీ కేశినేని నాని ఇంటింటి పర్యటన నిర్వహించారు. ఈ సందర్భంగా కేశినేని నాని మాట్లాడుతూ.. 20 నెలల కాలంలో జగన్ పరిపాలన ఎటువంటిదో ప్రజలు గమనించారన్నారు. ఈసారి తెలుగుదేశం పార్టీయే అధికారంలోకి వస్తుందన్నారు. విజయవాడ నగరాన్ని అభివృద్ధి చేసుకునే దమ్ము తనకుందన్నారు. గ్యాస్, పెట్రోలు, డీజిల్ ధరలు, ఇంటింటికి రేషన్, పేరుతో ప్రజలను తీవ్ర మోసం చేశాడన్నారు. రానున్న రోజుల్లో ప్రజలే బుద్ధి చెబుతారని ఎంపీ కేశినేనిపేర్కొన్నారు.

దుర్గగుడిలో కొనసాగుతున్న సోదాలు

విజయవాడ,ఫిబ్రవరి19(ఆర్ఎన్ఎ): దుర్గగుడిలో ఏసీబీ అధికారులు సోదాలు రెండవ రోజు కొనసాగు తున్నాయి. ఐదు బృందాలతో 25 మంది సిబ్బందితో ఏకకాలంలో సోదాలు నిర్వహిస్తున్నారు. కృష్ణా, గుంటూరు జిల్లాలకు సంబంధించిన అధికారులు సంయుక్తంగా సోదాలు చేపట్టారు. విజువల్స్, ఫుడ్ కంట్రోల్ అధికారులు దాడులలో పాల్గొన్నారు. ఇప్పటికే టిక్కెట్ కౌంటర్, చీరల కౌంటర్, స్టోర్స్, పరిపాలన విభాగంలో కీలక ఆధారాలను స్వీకరించారు. మరోసారి పరిపాలన విభాగంలో రికార్డులు, కంప్యూటర్ హార్డ్ డిస్కులను ఏసీబీ అధికారులు పూర్తిగా పరిశీలిస్తున్నారు.

మార్చిలో వికలాంగులకు కొవిడ్ వ్యాక్సిన్ : బోయినపల్లి వినోద్ కుమార్

హైదరాబాద్, ఫిబ్రవరి 19: రాష్ట్రంలోని వికలాంగులకు మార్చి నెలలో కొవిడ్ వ్యాక్సిన్ టీకాలు వేయనున్నామని, ఈ మేరకు రాష్ట్ర వైద్యారోగ్యశాఖ మంత్రి ఈటల రాజేందర్ అంగీకారం తెలిపినట్లు రాష్ట్ర ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడు బోయినపల్లి వినోద్ కుమార్ వెల్లడించారు. శుక్రవారం మంత్రుల నివాసంలో వినోద్ కుమార్‌ను జాతీయ వికలాంగుల హక్కుల ఫోరం అధ్యక్షుడు కొల్లి నాగేశ్వర్ రావు, రాష్ట్ర అధ్యక్షుడు జెరిపోతుల పరశురాం కలిసి ఈ మేరకు వినతిపత్రాన్ని అందజేశారు. వికలాంగుల హక్కుల ఫోరం విజ్ఞప్తి మేరకు మంత్రి ఈటల రాజేందర్‌తో వినోద్ కుమార్ మాట్లాడారు. దీంతో వికలాంగులకు మార్చి నెలలో కొవిడ్ వ్యాక్సిన్ టీకాలు వేసేందుకు మంత్రి ఈటల అంగీకరించారు.

ప్రతిపక్షాలు పిచ్చి ప్రేలాపనలు మానుకోవాలి : మంత్రి జగదీశ్ రెడ్డి



సూర్యాపేట, ఫిబ్రవరి 19 : ప్రతిపక్ష నాయకులు పిచ్చి ప్రేలాపనలు మానుకోవాలని మంత్రి జగదేశ్ రెడ్డి సూచించారు. పొద్దున లేస్తే ప్రభుత్వంపై అర్థరహిత, అసత్య ఆరోపణలు చేయడం తప్పా ప్రజలకు మంచి చేయాలన్న ఉద్దేశం వారికి ఏ మాత్రం లేదని ఆయన పేర్కొన్నారు. బీజేపీ, కాంగ్రెస్ నాయకులు స్థాయిని మరిచి సీఎంపై నోటికొచ్చి మాట్లాడుతున్నారని మండిపడ్డారు. పట్టాభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారంలో భాగంగా శుక్రవారం సూర్యాపేట జిల్లా కేంద్రంలో నిర్వహించిన నియోజకవర్గ స్థాయి ఎన్నికల సన్నాహక సభలో ఆయన మాట్లాడారు. నల్లగొండ-ఖమ్మం-వరంగల్ పట్టాభద్రుల ఎమ్మెల్సీగా గడిచిన ఆరేండ్లలో పల్లా రాజేశ్వర్ రెడ్డి అనునిత్యం ప్రజల సమస్యల పరిష్కారానికి కృషిచేశారు.

కేసీఆర్ నాయకత్వంలో రాష్ట్రం సుభిక్షం..

సీఎం కేసీఆర్ నాయకత్వంలో రాష్ట్రం సుభిక్షంగా ఉంది. అన్ని వర్గాలప్రజలు సంతోషంగా, ఆత్మగౌరవంతో జీవిస్తున్నారు. ప్రధాని మోదీ దేశాభివృద్ధికి చేసిందేమీ లేదు. కేంద్రంలోని బీజేపీ సర్కార్ కార్పొరేట్ శక్తులకు కొమ్ము కాస్తూ సామాన్య ప్రజల నడ్డి విరిస్తున్నది. పెట్రోల్, డీజిల్, గ్యాస్ ధరలు పెంచి ప్రజలను పిక్కుతింటున్నది. గతంలో బ్యారెల్ ధర రూ. 107 ఉన్నా పెట్రోల్ ధరలు పెరగలేదు. ఇప్పుడు కేవలం రూ. 57 మాత్రమే ఉన్నా మోదీ అనమర్థ విధానాల వల్ల ధర చుక్కలనంటుతున్నది.

ఇచ్చిన మాట కట్టుబడటంతో దేశంలో కేసీఆర్‌ను మించిన నాయకుడు లేడు. కరోనా వల్ల రాష్ట్ర ఆర్థిక వ్యవస్థ దిగజారినా అన్ని హామీలను అమలు చేస్తున్నాం' అని మంత్రి పేర్కొన్నారు.

త్వరలో 60 వేల ఉద్యోగాలు భర్తీ : పల్లా..

అనంతరం పల్లా రాజేశ్వర్ రెడ్డి మాట్లాడుతూ.. సీఎం కేసీఆర్ నాయకత్వంలో తెలంగాణ ప్రజలు చాలా సంతోషంగా ఉన్నారని అన్నారు. ఆరేండ్లలో తెలంగాణ ప్రభుత్వం 1, 31,000 ప్రభుత్వ ఉద్యోగాలను భర్తీ చేసింది. మరి కొద్దిరోజుల్లో మరో 60 వేల భర్తీ చేయనుంది. టీఎస్ఐపాస్ ద్వారా 14,800 ప్రైవేట్ సంస్థలు ఏర్పాటు చేసి రాష్ట్రంలో 14.5 లక్షల మంది నిరుద్యోగులకు ఉద్యోగాలు కల్పించాం.

తెలంగాణలో నిరుద్యోగుల రేటు తగ్గిందని కేంద్ర సర్వేలే తేల్చాయి. మళ్లీ తనను ఆశీర్వదించాలని పట్టాభద్రులను ఆయన కోరారు. సమావేశంలో రాజ్యసభ సభ్యుడు బడుగుల లింగయ్య యాదవ్, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ నిమ్మల శ్రీనివాస్ గౌడ్, టీఆర్ఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సోమా భరత్ కుమార్ గుప్తా, రాష్ట్ర కార్యదర్శి వైవీ, డీసీఎంఎస్ చైర్మన్ వట్టి జానయ్య యాదవ్, మున్సిపల్ చైర్మన్ పెరుమాండ్ల అన్నపూర్ణమ్మ, మార్కెట్ కమిటీ చైర్మన్ ఉప్పల లలితా ఆనంద్, టీఆర్ఎస్ నాయకులు నంద్యాల దయాకర్ రెడ్డి, పెద్దిరెడ్డి రాజా, జుట్టుకొండ సత్యనారాయణ, గండూరీ ప్రకాశ్ తదితరులు పాల్గొన్నారు.

స్టాండ్-అప్ పథకానికి ఉద్దీపనం అందించడానికి కాన్ఫెడరేషన్ ఆఫ్ విమెన్ ఎంటర్‌ప్రెన్యూర్స్‌తో భాగస్వామ్యం ప్రారంభించిన SIDBI సమర్పిస్తోంది, స్వావలంబన్ సశక్త్ - మెగా క్యాంపైన్ - వెబినార్ సిరీస్

హైదరాబాద్, ఫిబ్రవరి 19:సూక్ష్మ, చిన్న మరియు మధ్య తరహా ఎంటర్‌ప్రైజ్‌లు (ఓఓఇలు)కు ప్రచారం, ఆర్థిక అండ అందించడంతో పాటు వాటి అభివృద్ధి కోసం పనిచేసే కీలక ఆర్థిక సంస్థగా ఉన్న స్మాల్ ఇండస్ట్రీస్ డెవలప్మెంట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (సిఐఆఐ) ఇప్పుడు కాన్ఫెడరేషన్ ఆఫ్ విమెన్ ఎంటర్‌ప్రెన్యూర్స్ ఆఫ్ ఇండియా (ఆూచిఇ)తో కలసి 'స్వావలంబన్ సశక్త్ ? మెగా క్యాంపైన్'ను ప్రారంభించింది. స్టాండ్ అప్ ఇండియా (సిజిఎ) పథకానికి ఉద్దీపనం అందించడంలో భాగంగా అవగాహన, అందుబాటు మరియు వ్యాపార అవకాశ కార్యక్రమం రూపొందించడానికి ఈ 20 వెబినార్ సిరీస్ ప్రారంభించారు. సిజిఎ అనే ఈ ప్రతిష్టాత్మక కార్యక్రమాన్ని గౌరవనీయ భారత ప్రధాన మంత్రి శ్రీ నరేంద్ర మోడీ ప్రారంభించారు. తయారీ, సేవలు లేదా ట్రేడింగ్ రంగాల్లో గ్రీన్‌ఫీల్డ్ ఎంటర్‌ప్రైజ్ ఏర్పాటు చేయడం కోసం రూ. 10 లక్షల నుండి రూ. 1 కోటి మధ్య తీసుకునే రుణాల్లో కనీసం ఒక షెడ్యూల్ కులం (ఎస్.సి) లేదా షెడ్యూల్ తెగ (ఎస్.టి) రుణ గ్రహీత ఉండాలని మరియు ప్రతి బ్యాంకుకు సంబంధించి కనీసం ఒక మహిళా రుణగ్రహీత ఉండాలనే లక్ష్యంతో దీనిని ప్రారంభించారు. ఈ పథకాన్ని ప్రస్తుతం 2025 ఆర్థిక సంవత్సరం వరకు పొడిగించారు.

SIDBI డిప్యూటీ మేనేజింగ్ డైరెక్టర్ శ్రీ వి. సత్య వెంకటరావు మాట్లాడుతూ, "లక్షిత ఔత్సాహిక మహిళా పారిశ్రామికవేత్తలు స్వావలంబిగా, అంటే, ఉద్యోగం అన్వేషించే స్థాయి నుండి ఉద్యోగాలు సృష్టించే స్థాయికి చేరడం, కోసం వారిలో వ్యాపార నాయకత్వం అనే కోరికను రగిలించడానికి ఈ స్వావలంబన్ సశక్త్ ఉద్దేశించబడింది. ఓఓఇ పర్యావరణాన్ని బలోపేతం చేయడానికి సిఐఆఐ నిరంతరం ప్రయత్నిస్తుంటుంది. ప్రమోటర్ సహకారం తగ్గించి, వ్యవసాయ-అనుబంధ కార్యకలాపాలు జోడించడం కోసం భారత ప్రభుత్వం ఈ పథకానికి మరిన్ని మినహాయింపులు ప్రకటించింది. ఆత్మనిర్భర్ భారత్ మరియు స్థానిక వ్యవస్థాపకతను ప్రోత్సహించే దిశగా ఇదొక సమ్మిళిత మరియు వైపు అత్యంత ప్రభావవంతమైన అడుగు కానుంది" అన్నారు.

ప్రాంతీయంగా వరంగల్‌లో విస్తరణకు మ్యాక్స్ బుపా హెల్త్ ఇన్సూరెన్స్ వ్యూహం

వరంగల్, 19 ఫిబ్రవరి 2021: భారతదేశంలో అగ్రశ్రేణి స్వతంత్ర్య ఆరోగ్య బీమా సంస్థల్లో ఒకటిగా ఉన్నమ్యాక్స్ బుపా ఈనాడు తెలంగాణాలో తమ విస్తరణ ప్రణాళికలను రూపొందించింది. ఈ కంపెనీ తమ ఉనికిని తెలంగాణాలో అదనంగా నాలుగు శాఖలు ? హైదరాబాద్‌లో రెండు, వరంగల్ , నిజామాబాద్‌లలో ఒక శాఖ చొప్పున ప్రారంభించనుంది. మ్యాక్స్ బుపా వినియోగదారులు నగదు రహిత హాస్పిటలైజేషన్ సేవలను తెలంగాణాలో 300కు పైగా నెట్‌వర్క్ హాస్పిటల్స్ మరియు దేశవ్యాప్తంగా 6000కు పైగా నెట్‌వర్క్ హాస్పిటల్స్ నుంచి పొందవచ్చు. అంతేకాకుండా వారు కేవలం 30 నిమిషాల లోపుగానే క్యాష్‌లెస్ క్లెయిమ్స్ యొక్క ప్రీ ఆథరైజేషన్ ప్రయోజనాలను సైతం పొందవచ్చు. తద్వారా నాణ్యమైన ఆరోగ్య సంరక్షణ సేవలు మరింతగా పొందవచ్చు. ఈ కంపెనీ ఇప్పుడు తెలంగాణా రాష్ట్ర వ్యాప్తంగా హైదరాబాద్‌తో పాటుగా వరంగల్, నిజామాబాద్‌లలో సైతం తమ ఉనికిని చాటుతుంది. కోవిడ్?19 మహమ్మారి , ప్రజలకు ఆరోగ్య భీమా ఆవశ్యకతను తెలియజేసింది. సరైన చికిత్సనందుకోవడంలో అసాధారణ వైద్య ఖర్చుల నుంచి బయటపడాల్సిన అవసరమూ తెలియజెప్పింది. తెలంగాణా రాష్ట్ర వ్యాప్తంగా భీమా ఏజెంట్ల నడుమ నిర్వహించిన ఓ అధ్యయనం వెల్లడించే దాని ప్రకారం, కొవిడ్?19 తరువాత ఆరోగ్య భీమా కు గణనీయమైన డిమాండ్ పెరిగింది. ఈ అధ్యయనం మరింతగా వెల్లడించే దాని ప్రకారం, హైదరాబాద్, నిజామాబాద్‌లో ఆరోగ్య భీమా ఉత్పత్తులకు డిమాండ్ గణనీయంగా పెరిగింది. చాలామందికి ఈ నేపథ్యం గురించిన స్పష్టత చాలా తక్కువగా ఉంది. .మ్యాక్స్ బుపా హెల్త్ ఇన్సూరెన్స్ ఎండీ అండ్ సీఈవో శ్రీ కృష్ణన్ రామచంద్రన్ ఈ సందర్భంగా మాట్లాడుతూ 'మెరుగైన వైద్య చికిత్సలను పొందడంతో పాటుగా ఒకరి ఆర్థిక ఆరోగ్యం నిర్వహించడంలో ఆరోగ్య భీమా సుదూరం వెళ్తుందనే వాస్తవాన్ని ప్రజలు గ్రహించేలా కోవిడ్ -19 చేసింది. కోవిడ్-19 మహమ్మారి తరువాత, ఆరోగ్య భీమా పరిశ్రమ డిమాండ్‌ను కొనుగోలుగా మార్చగలిగింది. నమ్మకమైన ఆరోగ్య భాగస్వామిగా, మ్యాక్స్ బుపా లక్ష్యం ఎప్పుడూ కూడా ఈ అవగాహనను మెరుగుపరిచి, వచ్చే రెండేళ్లలో ఎక్కువ సంఖ్యలో మార్కెట్‌లకు చేరువ కావడం. తద్వారా మరింత మంది ప్రజలను ఆరోగ్య భీమా పరిధిలోకి తీసుకురాబోతున్నాం. మ్యాక్స్ బుపా ఇప్పుడు అదనంగా మరో 45 నగరాలలో తమ కార్యాలయాలను తెరువబోతుంది. రాబోయే రెండేళ్లలో భారతదేశ వ్యాప్తంగా మా కార్యాలయాల సంఖ్యను 200కు చేర్చనున్నాం' అని అన్నారు. మ్యాక్స్ బుపా హెల్త్ ఇన్సూరెన